ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
అనంతపురం
జిల్లా వార్తలు
గురువారం 18 జనవరి 2024



గణతంత్ర వేడుకలను ఘనంగా నిర్వహిద్దాం: జేసీ

అనంతపురం టౌన్, జనవరి 17: గణతంత్ర దినోత్సవాలను ఈ నెల 26న జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని అధికారులను జాయింట్ కలెక్టర్ కేతన్‌గార్గ్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో వేడుకలకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. కేటాయించిన బాధ్యతలను ఆయా శాఖల అధికారులు నిర్వర్తించాలని అన్నారు. ప్రభుత్వ పథకాలను తెలిపే శకటాలు, స్టాల్స్ ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ వైఖోమ్ నిదియా, నగరపాలిక కమిషనర్ మేఘ స్వరూప్, డీఆర్‌ఓ గాయిత్రీదేవి, ఆర్డీఓ వెంకటేష్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, డీఎంహెచ్‌ఓ ఈబీ దేవీ తదితరులు పాల్గొన్నారు.



ప్రభాకర్ చౌదరిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



బీసీలంతా ఏకమౌదాం!

అరాచక పాలనకు చరమగీతం పాడుదాం
టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు
నగరంలో జయహో బీసీ సభ

అనంతపురం అర్బన్, జనవరి 17: బీసీలంతా ఏకమై వైసీపీ అరాచక పాలనకు చరమగీతం పాడాలని టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు కాలవ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. అనంతపురం అర్బన్ పరిధిలోని ఐదో రోడ్డులో టీడీపీ బీసీ సెల్ నగర అధ్యక్షుడు సిమెంట్ పోలన్న అధ్యక్షతన జయహో బీసీ సదస్సును బుధవారం సాయంత్రం నిర్వహించారు. అంతకు ముందు మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరిని స్థానిక నాయకులు గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా కాలవ మాట్లాడుతూ... సీఎం జగన్ బీసీలను అడుగుఅడుగునా అణచివేస్తున్నారని మండిపడ్డారు. వైసీపీ పాలనలో 76 మంది బీసీలను పొట్టనపెట్టుకున్నారని అన్నారు. అనేక మంది బీసీ నాయకులు, కార్యకర్తలపై



అక్రమ కేసులు బనాయించారని దుయ్యబట్టారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్లు కల్పించి, రాజకీయ ప్రాధాన్యం కల్పించిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. అధికారంలో బీసీలను భాగస్వాములను చేసి, ఆ వర్గాలకు అభ్యున్నతి కోసం ఎన్టీఆర్, చంద్రబాబు పాటుపడ్డారని గుర్తు చేశారు. రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం బీసీలంతా నడుం బిగించి ముందుకు కదలాలని కోరారు.

టీడీపీతోనే సామాజిక న్యాయం: ప్రభాకర్ చౌదరి

సామాజిక న్యాయం టీడీపీతోనే సాధ్యమని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి అన్నారు. కుల మతాలకు అతీతంగా అన్ని వర్గాల సంక్షేమం కోసం పాటుపడిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. టీడీపీ పాలనలో బీసీలకు రాజకీయంగా పెద్ద పీట వేశామని, ఆ వర్గాలకు అన్ని విధాలా చేయూతనిచ్చామని అన్నారు. వైసీపీ పాలనలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలపై దాడులు పెరిగిపోయాయని విమర్శించారు. తాను ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు అనంతపురం అర్బన్‌ను అభివృద్ధి చేశానని గుర్తు చేశారు. ఆహ్లాద వాతావరణం కోసం పార్కులు, ఓపెన్ జిమ్ములు ఏర్పాటు చేశామని అన్నారు. నగరంలోని పలు చోట్ల రోడ్లు వేయించామన్నారు. సుభాష్ రోడ్డు, గుత్తి రోడ్డు నిర్మాణాల కోసం తాను కేంద్ర మంత్రులను కలిసి నిధులు మంజూరు చేయించానని అన్నారు. ఎన్నికలు రావడంతో టెండర్లు పిలవలేకపోయామని, వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డి అంతా అయనే చేసినట్లు పదే పదే అబద్ధాలు చెప్పడం సరికాదని అన్నారు. అనంత నగర అభివృద్ధిపై ఆయనకు కొద్ది పాటి చిత్తశుద్ధి కూడా లేదని అన్నారు. అసెంబ్లీలో తాను అనేక మార్లు ప్రజల తరఫున మాట్లాడానని, అనంత వెంకటరామిరెడ్డి ఏనాడూ అసెంబ్లీలో మాట్లాడిన పాపానపోలేదని అన్నారు. టీడీపీ హయాంలో ఆరు వేలకుపైగా టిడ్కో ఇళ్ల నిర్మాణం 80 శాతానికి పైగా పూర్తి చేశామని, వైసీపీ పాలనలో మిగతా పనులు చేయకుండా శిథిలావస్థకు చేర్చారని విమర్శించారు. టిడ్కో ఇళ్ల లబ్ధిదారులకు బ్యాంకుల నుంచి నోటీసులు వస్తున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని మండిపడ్డారు. ఆరు మాసాల్లో అండర్ డ్రైనేజీ నిర్మిస్తామని హామి ఇచ్చిన అనంత వెంకటరామిరెడ్డి, ఇప్పటి దాకా ఆ ఊసే ఎత్తకపోవడం దారుణమని అన్నారు. ఇసుక అక్రమ రవాణా, గంజాయి, కల్తీ మద్యం విక్రయాలు, అన్ని రకాల ధరలు పెంచేసి ప్రజలపై భారం మోపడం తప్ప వైసీపీ చేసిందేమీ లేదని అన్నారు. మన కోసం, మన పిల్లల భవిష్యత్తు కోసం చంద్రబాబును సీఎం చేసుకుందామని ప్రజలకు పిలుపునిచ్చారు. రాబోవు ఎన్నికల్లో వైసీపీకి తగిన గుణపాఠం చెప్పి, టీడీపీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు తలారి ఆదినారాయణ, దేవళ్ల మురళి, దళవాయి వెంకటనారాయణ, కుంచెపు వెంకటేష్, ఆవుల కృష్ణయ్య, గంజే నాగరాజు, సాలార్ బాషా, పోతుల లక్ష్మీనరసింహులు, నారాయణస్వామి యాదవ్, సుధాకర్ యాదవ్, మారుతీకుమార్ గౌడ్, డిష్ నాగరాజు, సరిపూటి రమణ, సైపుద్దీన్, వడ్డే మూర్తి, గోపాల్ గౌడ్, కురుబ నారాయణస్వామి, సుభాష్ చంద్రబోస్, నెట్‌కాన్ చంద్ర, పుల్లన్న, మల్లికార్జున, బంగి నాగ, శివబాల, వడ్డే సరళ, విశాలాక్షి, సంగా తేజశ్విని, విజయశ్రీ, దళవాయి రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



సభకు హాజరైన నాయకులు, కార్యకర్తలు

పెద్దలను వదిలి.. పేదలపై పడి..!

గుడిసెలను కూల్చేశారు.. ప్లాట్లను వదిలేశారు..
మాన్యం భూములపై దేవదాయశాఖ ద్వంద్వ వైఖరి

అనంతపురం కల్చరల్, జనవరి 17: మాన్యం భూములు అన్యాక్రాంతం అవుతున్నా దేవదాయ శాఖ పట్టించుకోవడం లేదు. అధికార పార్టీ నాయకుల ఒత్తిళ్లకు తలొగ్గి వాటి జోలికి వెళ్లడంలేదు. అధికారపార్టీ అండలేని పేదలు నివాసాలు ఏర్పరుచుకుంటే మాత్రం వెంటనే రంగంలోకి దిగుతున్నారు. నిర్దాక్షిణ్యంగా కూల్చివేస్తున్నారు. పేదల పట్ల ఒకలా.. పెద్దల పట్ల మరోలా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. ఇందుకు ఉదాహరణ.. కల్లూరు వద్ద పేదల ఇళ్లను కూల్చివేయడమే.



కల్లూరులో దేవదాయ శాఖ అధికారులు కూల్చివేసిన నివాసాలు (ఫైల్)

నిర్దాక్షిణ్యంగా..

కల్లూరు సర్వే నంబరు 165లో 3.43 ఎకరాల మాన్యం భూమి ఉంది. అందులో రెండు ఎకరాల్లో వెనుకబడిన తరగతులకు చెందిన దాదాపు 150 కుటుంబాలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నాయి. వీటిని కూల్చివేసేందుకు గత ఏడాది నవంబరు 1న దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్ ఆదిశేష నాయుడు నేతృత్వంలో పోలీసులు వెళ్లారు. అర్ధరాత్రి దాటాక నిర్దాక్షిణ్యంగా నివాస గృహాలను కూల్చివేశారు. అడ్డుకునేందుకు వెళ్లిన వామపక్ష నాయకులపై పోలీసులు లాఠీలు ఝులిపించారు. ఆ ఘటన తరువాత బాధితుల పక్షాన వామపక్షాలు, ప్రజాసంఘాలు ఆందోళన చేశాయి. బాధిత కుటుంబాలు దేవదాయశాఖ అధికారులు, కలెక్టరేట్ చుట్టూ ప్రదక్షిణ చేశాయి. ప్రత్యామ్నాయంగా నివాసాలు ఏర్పాటు చేయిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. ఇప్పటికీ బాధితులకు న్యాయం జరగలేదు. ఇదే సర్వే నంబరులో 43 సెంట్లలో అధికారపార్టీకి చెందిన కొందరు ప్లాట్లు వేశారు. వాటి జోలికి మాత్రం అధికారులు వెళ్లడం లేదు. అనంతపురం నగరంలో సైతం పలు ఆలయాల భూముల్లో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఎకరాలకు ఎకరాలు అన్యాక్రాంతం అయ్యింది. వాటి వైపు అధికారులు కన్నెత్తి చూడటం లేదు. అధికార పార్టీ ప్రజా ప్రతినిధుల ఒత్తిళ్లే దీనికి కారణమన్న ఆరోపణలు ఉన్నాయి.



అప్పులపాలయ్యాం...

నా కుమార్తె నగలు తాకట్టు పెట్టాను. ప్రైవేట్ వ్యక్తుల నుంచి అప్పు తీసుకున్నాను. మొత్తం రూ.4.5 లక్షల వ్యయంతో కల్లూరు వద్ద ఇల్లు నిర్మించుకున్నాం. కూలి పనులు చేసుకుని జీవించే మాకు సొంతిల్లు లేదు. అందుకే కల్లూరులో అందరితోపాటు మేమూ ఓ ఇంటిని నిర్మించుకున్నాం. దేవదాయశాఖ అధికారులు ఇంటిని కూల్చివేయడం వల్ల నిలువ నీడ లేకుండా పోయింది. రోడ్డున పడ్డాం. ఇంటి కోసం చేసిన అప్పులు కట్టుకోలేని దుస్థితిలో ఉన్నాం. రాజకీయ అండ ఉన్న వారిని వదిలేసి మాలాంటి పేదల నివాసాలను కూల్చివేయడం తగదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మాలాంటివారికి న్యాయం చేయాలి.

\- లక్ష్మీదేవి, కల్లూరు

నోటీసులు జారీ చేశాం..



చెన్నకేశ్వస్వామి, బసవేశ్వరస్వామి ఆలయాల మాన్యం భూములను ఆక్రమించుకుని నివాసాలు ఏర్పాటు చేసుకున్నవారికి నోటీసులు జారీ చేశాం. ఇళ్లను ఖాళీ చేయాలని మూడు రోజుల క్రితం నోటీసులు ఇచ్చాం. కోర్టు నిబంధనల మేరకు 15 రోజులు గడువు ఇచ్చాం. నిబంధనల మేరకు తదుపరి చర్యలు చేపడతాం.

\- ఆదిశేషనాయుడు, దేవదాయశాఖ జిల్లా సహాయ కమిషనర్

ప్రజాచైతన్యం కోసమే బస్సుయాత్ర

మాజీ ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్ రెడ్డి
పెద్దవడుగూరు మండలంలో పర్యటన



ప్రజలకు అభివాదం చేస్తున్న జేసీపీఆర్

తాడిపత్రి, జనవరి 17: వైసీపీ మోసాలు, దౌర్జన్యాలు, అవినీతి, అక్రమాలపై ప్రజల్లో చైతన్యం కలిగించేందుకే బస్సు యాత్ర చేపట్టానని మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్ రెడ్డి అన్నారు. పెద్దవడుగూరు మండలంలో ఆయన తొలిరోజు బస్సుయాత్రను బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా తాడిపత్రిలోని ఆయన నివాసం వద్ద యువచైతన్య బస్సుయాత్రను జేసీ ప్రభాకర్ రెడ్డి సతీమణి జేసీ ఉమారెడ్డి, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి సతీమణి అర్పితారెడ్డి టెంకాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం అశోక్ పిల్లర్ వద్దగల అభయాంజనేయస్వామికి ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అక్కడి నుంచి దాదాపు 300 వాహనాల్లో నాయకులు, అనుచరులు, అభిమానులతో కలిసి మిడుతూరుకు చేరుకున్నారు. దారిపొడవునా నాయకులు, అభిమానులు బాణసంచా పేల్చుతూ ఘనస్వాగతం పలికారు. 'యువతా మేలుకో.. నీ నేలను ఏలుకో' అన్న నినాదంతో చేపట్టిన బస్సుయాత్రకు అనూహ్య స్పందన లభించింది. పెద్దవడుగూరు మండలంలో ఈ నెల 30వరకు 12 రోజులపాటు బస్సుయాత్ర జరగనుంది.

అభ్యర్థులను ప్రకటించండి సార్..

రాబోయే ఎన్నికలలో పార్టీ తరఫున పోటీచేసే అభ్యర్థులను వెంటనే ప్రకటించాలని టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడును జేసీ ప్రభాకర్‌రెడ్డి అభ్యర్థించారు. మిడుతూరు వద్ద ఆయన విలేకరులతో మాట్లాడారు. 'సీఎం జగన్ అభ్యర్థుల మార్పులు చేర్పులు చేస్తున్నారు. మీరు మాత్రం అప్పుడు ఇప్పుడు అంటూ ఆలస్యం చేస్తున్నారు..' అని చంద్రబాబునుద్దేశించి అన్నారు. టికెట్ ఆశించే అభ్యర్థులు గెలుస్తామనే ఊహల్లో తేలుతున్నారని, ఊహల్లో కాకుండా జనాల్లో ఉండాలని అన్నారు. ప్రజల్లో ఉన్న వారికి మాత్రమే పట్టం కడతారన్న దానికి 2021 మున్సిపల్ ఎన్నికలే నిదర్శనమని అన్నారు.

గ్రానైట్, బండల పాలిష్ యూనిట్లు నాశనం..

వైసీపీ ప్రభుత్వంలో తాడిపత్రి పరిసర ప్రాంతాల్లోని గ్రానైట్, బండలపాలిష్ యూనిట్లు నాశనమయ్యాయని జేసీ ప్రభాకర్ రెడ్డి మండిపడ్డారు. పెరిగిన విద్యుత్ చార్జీలను చెల్లించలేక ఎన్నో యూనిట్లు మూతపడ్డాయని అన్నారు. యూనిట్‌కు రూ.2 తగ్గించి ఉంటే వీటి పరిస్థితి మరోరకంగా ఉండేదని అన్నారు. వైసీపీ ప్రభుత్వం కారణంగా లారీ పరిశ్రమ కూడా కుదేలైందని అన్నారు. గతంలో తాడిపత్రి ప్రాంతంలో 3500 పైగా లారీలు ఉండేవని అందులో వందకు పైగా తన లారీలు కూడా ఉండేవని తెలిపారు. తాడిపత్రి మండలంలో పండే చీనీ, రేగు, దానిమ్మ తదితర పంటలకు సరైన మార్కెట్ లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. యాడికి మండలంలో సిమెంట్ ఫ్యాక్టరీల వద్ద ఒక్కొక్క వైసీపీ నాయకుడు 20 నుంచి 30 లారీలు పెట్టుకొని గుత్తాధిపత్యాన్ని చెలాయిస్తూ, మిగిలిన వారికి ఉపాధి అవకాశాలు లేకుండా చేస్తున్నారని విమర్శించారు. రాయలచెరువులో గనుల పరిస్థితి కూడా బాగాలేదని అన్నారు. యాడికి, తాడిపత్రి, పెద్దపప్పూరు మండలాల్లో చేనేత కార్మికుల కోసం ప్రభుత్వ సాయం లేకుండా, ప్రత్యేక హబ్ ఏర్పాటుకు కృషిచేస్తానని అన్నారు. ప్రతి మండలకేంద్రంలో అండర్ డ్రైనేజీని ఏర్పాటు చేస్తానని అన్నారు. రానున్నది టీడీపీ ప్రభుత్వమని తెలిపారు. అన్నింటినీ దారిలోకి తీసుకువస్తానని అన్నారు.

రైతుపై చిరుత దాడి



కళ్యాణదుర్గం రూరల్, జనవరి 17: మండలంలోని కుర్లపల్లి గ్రామానికి చెందిన రైతు రామమూర్తిపై బుధవారం తెల్లవారుజామున చిరుత దాడి చేసి గాయపరిచింది. అటవీ అధికారులు తెలిపిన మేరకు రైతు రామమూర్తి తన పొలంలో పనులకు వెళుతున్న సందర్భంలో పొదల్లో ఉన్న చిరుత దాడి చేసింది. రామమూర్తి గట్టిగా అరవడంతో చుట్టు పక్కల ప్రజలు వచ్చేసరికి చిరుత అడవిలోకి పరుగులు తీసింది. గ్రామస్థులు బాధితుడిని కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సంఘటన స్థలాన్ని అటవీ అధికారులు పరిశీలించారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రైతు రామమూర్తి

సీఎం మొండి వైఖరి వీడకుంటే..
ఉద్యమం మరింత ఉధృతం

ప్రాణత్యాగానికైనా సిద్ధం: సీఐటీయూ
37వ రోజు అంగన్‌వాడీల నిరసన



నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు

అనంతపురం విద్య, జనవరి 17: సీఎం జగన్ మొండివైఖరి వీడి.. అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ హెచ్చరించారు. కలెక్టరేట్ వద్ద బుధవారం నిర్వహించిన వంటావార్పులో ఆయన పాల్గొన్నారు. వందలాది మంది అంగన్‌వాడీ కార్యకర్తలు, సీఐటీయూ నాయకులు మండుటెండలో రోడ్డుపై భోజనాలు చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... ప్రభుత్వంతో ఆరుసార్లు చర్చలు జరిపామని, అయినా జీతాలు పెంచబోమని మొండిగా చెబుతోందని అన్నారు. ప్రభుత్వం తీరువల్లే అంగన్‌వాడీలు తమ ఉద్యమాన్ని ఉధృతం చేస్తున్నారని అన్నారు. అంగన్‌వాడీల సమస్యల పరిష్కారానికి ప్రాణత్యాగానికి కూడా వెనకాడబోమని ఆయన అన్నారు. ప్రభుత్వం మొండి వైఖరికి తగిన సమాధానం చెప్పే రోజులు కూడా వచ్చాయని అన్నారు. ప్రజల మద్దతుతోనే ఉద్యమం 37 రోజులుగా నిర్విరామంగా కొనసాగుతోందని అన్నారు. న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకూ పోరాటం ఆపేది లేదని తేల్చిచెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు రమాదేవి, జమున, భారతి, అరుణ, షాహినా, మహబూబీ, సీఐటీయూ నాయకులు వెంకటనారాయణ, రామాంజినేయులు, గోపాల్, శివప్రసాద్, ఆజాం బాషా, ఆదినారాయణ, లింగారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ ఎదుట రోడ్డుపైనే భోజనాలు



గ్రామాలకు ఆగిన శ్రీరామిరెడ్డి నీరు

120 మంది కార్మికులు వేతనాలు, పీఎఫ్ కోసం ఎదురుచూపు

నేడు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కార్యాలయం ముట్టడికి పిలుపు



మూతపడ్డ శ్రీరామిరెడ్డి తాగునీటి పంపుహౌస్

కళ్యాణదుర్గం, జనవరి 17: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పని చేస్తున్న కార్మికుల ఆందోళన ఉధృతం అవుతోంది. గత 17 రోజులుగా కార్మికులు సమ్మె చేస్తున్నా సంబంధిత అధికారులు స్పందించడం లేదు. ఈక్రమంలోనే బుధవారం పంప్‌హౌస్‌కు తాళాలు వేశారు. ఫేజ్-4 కింద ఉన్న కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 120 మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. దీంతో సుమారు 224 గ్రామాలకు తాగునీటి సరఫరా ఆగిపోయింది. 15 ఏళ్లుగా ఈ పథకంలో పనిచేస్తున్నామని, నెలనెలా జీతాలు, ఇతరత్రా ప్రయోజనాలు కల్పించడంలో అధికారులు, కాంట్రాక్టర్లు నిర్లక్ష్యం చేస్తున్నారని వారు వాపోయారు. జీతాలు ఇవ్వకపోతే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ఆవేదన వ్యక్తం చేశారు. జీతాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అధికారులు తూతు మంత్రంగా చర్చలు జరిపి రెండు నెలల జీతాలు మాత్రమే మంజూరు చేశారు. మిగిలిన మూడు నెలల జీతాలు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేస్తున్నారు. గత ఏడాది మార్చి నుంచి పీఎఫ్ కూడా ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. జిల్లా కేంద్రంలోని ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ కార్యాలయాన్ని గురువారం ముట్టడించి, ఆందోళన మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

శ్రీరామిరెడ్డి కార్మికులపై క్రిమినల్ కేసులు



పోలీసులతో వాగ్వాదం చేస్తున్న సీఐటీయూ నాయకులు, కార్మికులు

ఉరవకొండ, జనవరి 17: శ్రీరామిరెడ్డి తాగునీటి పథకంలో పనిచేస్తున్న కార్మికులపై పోలీసులు క్రిమినల్ కేసులు నమోదు చేశారు. పైప్‌లైన్లు పగులగొట్టారంటూ అధికారులు ఈ నెల 14న పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో 427, 431 సెక్షన్ కింద కార్మికులు ప్రకాష్, రాము, అశోక్, లక్ష్మీనారాయణ, గణేష్, సంజప్ప పై పోలీసులు కేసు నమోదు చేశారు.

విచారణ చేయకుండా కేసు ఎలా నమోదు చేస్తారు: కార్మికులు

ఏదైనా సంఘటనకు సంబంధించి విచారణ చేయకుండా కేసులు ఎలా నమోదు చేస్తారని పోలీసులను కార్మికులు బుధవారం ప్రశ్నించారు. జీతాలు అడిగినందుకు, పైపులు పగులగొట్టారని ఆరుగురు కార్మికులపై కేసులు బనాయించారని ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యానికి పాల్పడిన అధికారులు, అధికారపార్టీ నాయకులపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కేసు నమోదు చేయాలని పోలీసులకు ఫిర్యాదు కాపీ అందజేస్తుండగా తీసుకోవడానికి వారు నిరాకరించారు. దీంతో కార్మికులు రోడ్డుపై బైఠాయించేందుకు ప్రయత్నించగా హెడ్ కానిస్టేబుల్ ఫిర్యాదును స్వీకరించారు. అనంతరం కార్మికులు మాట్లాడుతూ సమ్మెలో ఉంటే తమపై అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. అవగాహన లేకుండా సొల్లాపురం సర్పంచు భర్త భాస్కర్ రెడ్డి, అధికారులు మోటార్లు రన్ చేయడం వల్ల పైపులు పగిలిపోయాయన్నారు. వారిపై కేసు నమోదు చేయకుండా, తమపై కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. తమను కులం పేరుతో దూషించిన సొల్లాపురం సర్పంచు భర్త భాస్కర్‌రెడ్డి, ఈఈ జవహర్‌కుమార్, డీఈ శ్రీనివాసులుపై కేసు నమోదు చేయాలన్నారు.

బిల్లులెందుకు చేయరు..?

- నిధులు ఎందుకు ఇవ్వరు..?
- జడ్పీలో అధికారులపై ప్రశ్నల వర్షం
- తాగునీటి పథకాల సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై రభస
- అగ్రిమెంట్ రద్దుకు తీర్మానం చేస్తామన్న చైర్ పర్సన్
- విచారణ చేయిస్తామన్న కలెక్టర్ గౌతమి





జడ్పీ సమావేశంలో మాట్లాడుతున్న అనంతపురం కలెక్టర్ గౌతమి, వేదికపై చైర్ పర్సన్ గిరిజమ్మ, హాజరైన ఎమ్మెల్యేలు, జడ్పీటీసీలు

అనంతపురం విద్య, జనవరి 17: తాగునీటి సమస్య, టెండర్లు, అధికారుల అవినీతి వ్యవహారాలు జడ్పీ సర్వసభ్య సమావేశంలో వేడిని పెంచాయి. ఎంతసేపు అడిగినా మైక్ ఇవ్వకపోవడంతో అధికార పార్టీ సభ్యులు కొందరు అలిగి బయటకు వెళ్లారు. తన మండలంలో అభివృద్ధి జరగలేదని, నిధులు ఇవ్వకుండా వివక్ష చూపుతున్నారని విపక్ష సభ్యుడు నిరసన తెలిపారు. జిల్లా అధికార యంత్రాంగంపై పాలకవర్గ సభ్యులు ప్రశ్నలతో దాడి చేశారు. అధికారులు నీళ్లు నమిలారు. తాగునీటి పథకాల నిర్వహణకు సంబంధించిన సప్లిమెంటరీ అగ్రిమెంట్, వాటర్ వర్క్స్ ఆపరేట్ అండ్ మెయింటెనెన్స్ (ఓఅండ్ఎం) బిల్లుల చెల్లింపుపై చర్చ తీవ్రస్థాయిలో సాగింది. సుమారు గంట పాటు జడ్పీచైర్ పర్సన్, సభ్యులు అడిగే ప్రశ్నలకు ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, జడ్పీ సీఈఓ సమాధానం చెప్పలేక నీళ్లు నమిలారు. కేవలం మూడున్నర గంటలు సాగిన సమావేశానికి ఎమ్మెల్యేలు నలుగురు మాత్రమే వచ్చారు. మెజార్టీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్ ఛైర్మన్లు గైర్హాజరయ్యారు.

అధికార పార్టీ సభ్యుల ఆగ్రహం.. అలకలు

అధికార పార్టీ జడ్పీటీసీలు అధికారుల తీరుపై పరోక్షంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. బుక్కరాయసముద్రం జడ్పీటీసీ భాస్కర్ మాట్లాడుతూ, జడ్పీ నిధులు కూడా జడ్పీటీసీలకు దక్కడంలేదని, జడ్పీ గ్రాంట్ పనులకు కూడా పంచాయతీ, మండల పరిషత్ నుంచి తీర్మానాలు తేవాలని చెప్పడం అన్యాయమని అన్నారు. ఇది జడ్పీ సీఈఓ తమను చిన్నచూపు చూడటమేనని ఆవేదన వ్యక్తం చేశారు. కంబదూరు జడ్పీటీసీ నాగరాజు సైతం తీర్మానాల అంశంపై పెదవి విరిచారు. చేసిన పనులకు బిల్లులు కూడా కావడం లేదని, ఆఖరికి వడ్డీలు కట్టలేక ఇబ్బంది పడుతున్నామని కదిరి ఎంపీపీ అమర్‌నాథ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు, ఎంపీపీలు ఎవరన్నా భయం లేకుండా పోయిందని, జడ్పీలో ఏం జరుగుతోందని జడ్పీ ఉన్నతాధికారులపై మండిపడ్డారు. సభ్యులంటే లెక్కలేదని పరోక్షంగా జడ్పీ సీఈఓ, డిప్యూటీ సీఈఓపై మండిపడ్డారు. ఫోన్లు చేసి అడిగితే బిల్లులు మరింత ఆలస్యం చేస్తారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ క్రమంలో మాట్లాడేందుకు పలుమార్లు మైక్ అడిగినా ఎవరూ ఇవ్వకపోవడంతో యల్లనూరు జడ్పీటీసీ భోగాతి ప్రతాప్‌రెడ్డి సీట్‌లోంచి లేచి ఆగ్రహం వ్యక్తం చేస్తూ బయటకు వెళ్లిపోయాజారు. మైక్ అడిగినా ఇవ్వకుంటే ఎలా అని మండిపడ్డారు. తర్వాత సభాధ్యక్షులు గిరిజమ్మ కలుగజేసుకోగా, సిబ్బంది మైక్ ఇచ్చారు. ఓ అండ్ ఎం బిల్లులు ఇష్టారాజ్యంగా చేస్తున్నారని ప్రతాప్ రెడ్డి మండిపడ్డారు. ఏమాత్రం సీనియారిటీ పాటించడం లేదని అన్నారు. రెండేళ్ల కిందట బిల్లలను కాదని, ఆరు నెలల కిందట వచ్చిన బిల్లలను ఎలా చెల్లిస్తారని ప్రశ్నించారు. యల్లనూరు మండలంలో సుమారు రూ.36 లక్షల వరకూ పెండింగ్ పెట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ఓఅండ్ఎం బిల్లులు చెల్లింపులో సీనియారిటీ పాటించకపోవడంపై సభ్యుల ఆగ్రహం నేపథ్యంలో కలెక్టర్ కలుగజేసుకున్నారు. తాగునీటి బిల్లులు కీలకమని, వాటిని ఆపలేమని అన్నారు. ముందు పంపిన బిల్లులకు చెల్లింపు జరగాల్సి ఉందని, బిల్లుల చెల్లింపుపై ప్రాధాన్యత పాటించేలా లిస్టులు చూస్తామని, అదనపు ఫండ్స్ కూడా రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని, రాగానే చెల్లిస్తామని తెలిపారు.

మాపై వివక్ష ఎందుకు..? : టీడీపీ జడ్పీటీసీ ఉమేష్



సభ ప్రారంభం కాగానే అగళి జడ్పీటీసీ సభ్యుడు ఉమేష్ మాట్లాడారు. పంచాయతీ రాజ్ చట్టం ప్రకారం 90 రోజుల్లో నిర్వహించాల్సిన సమావేశాన్ని 136 రోజులు దాటినా నిర్వహించకుంటే తమ సమస్యలను ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. తన మండలానికి ఇప్పటి వరకూ నిధులు ఇవ్వలేదని, ఎలాంటి అభివృద్ధి జరగలేదని, ప్రజలకు ఏం సమాధానం చెప్పాలని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభివృద్ధి లేనప్పుడు రాజీనామా చేయడమే నయమని అన్నారు. దీంతో వైసీపీకి చెందిన లేపాక్షి, బుక్కరాయసముద్రం, శెట్టూరు, గుడిబండ జడ్పీటీసీలు, బెళుగుప్ప ఎంపీపీ ఆయనను చుట్టుముట్టారు. 'రాజీనామా చేయమని ఎవరు అడిగారు..? సమస్యలపై మాత్రమే మాట్లాడండి' అంటూ జడ్పీ సిబ్బందితో కలిసి వైసీపీ జడ్పీటీసీ సభ్యులు మైక్ లాక్కోబోయారు. జడ్పీ చైర్ పర్సన్ కలుగుజేసుకుని, అభివృద్ధికి నిధుల కోసం అంచనాలతో లేఖ ఇవ్వాలని, పరిశీలిస్తామని, అన్ని మండలాలు సమానమేని అన్నారు. దీంతో టీడీపీ జడ్పీటీసీ శాంతించారు.



టీడీపీ జడ్పీటీసీని చుట్టుముట్టిన వైసీపీ జడ్పీటీసీలు

సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై గరం గరం

ఆర్‌డబ్ల్యుఎస్ వర్క్స్‌పై చర్చ ఆరంభం కాగానే జిల్లాలోని పలు తాగునీటి పథకాల్లోని ఫిల్టర్ బెడ్స్‌ను ఎందుకు మార్చలేదని జడ్పీ చైర్‌పర్సన్ ఆ శాఖ ఎస్ఈ ఎహసాన్ బాషాపై ఫైర్ అయ్యారు. రెండేళ్లుగా పది ఇరవై సార్లు చెప్పినా పట్టించుకోరా అని నిలదీశారు. కలుషిత నీరుతాగి ప్రజలు ఏం కావాలి..? ఎందుకు టెండర్లు పిలవలేదు..? అని ప్రశ్నించారు. టెండర్లు పిలిచినా ఎవరూ రాలేదని ఆయన సమాధానమిచ్చారు. దీంతో గత కలెక్టర్, జడ్పీ సీఈఓ చెప్పినా నామినేషన్ కింద ఎందుకు ఆ పనులు చేయలేదని చైర్ పర్సన్ మండిపడ్డారు. తాగునీటి పథకాల అగ్రిమెంట్ గడువు ముగిసినా ఎందుకు టెండర్లు పిలవలేదని ప్రశ్నించారు. దీంతో ఎస్ఈ నీళ్లు నమిలారు. గతంలో సస్పెండై వెళ్లిపోయిన జడ్పీ సీఈఓ పేరిట సప్లిమెంటరీ అగ్రిమెంట్ ఎలా చేస్తారని, ఇందులో ఎన్ని లక్షల అవినీతి జరిగిందని ప్రశ్నించారు. దీంతో అధికారులు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. కొన్ని తాగునీటి పథకాల సప్లిమెంటరీ అగ్రిమెంట్ చేసి, ధర్మవరం, ముదిగుబ్బ, గుత్తి, రాయదుర్గం, తాడిపత్రి, గుంతకల్లు పరిధిలోని మరికొన్ని పథకాలను పక్కన ఎలా పెడతారని ప్రశ్నించారు. లక్షల డబ్బులు ముడుపులు ముడితే.. చేస్తారా..? మిగిలినవి పట్టించుకోరా...? అంటూ ఫైర్ అయ్యారు. జడ్పీచైర్ పర్సన్‌తోపాటు పలువురు జడ్పీటీసీలు కూడా మైక్ అందుకోవడంతో ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ, జడ్పీ సీఈఓ సమాధానం చెప్పలేకపోయారు. నిబంధనలకు విరుద్ధంగా చేసిన అగ్రిమెంట్‌ను రద్దు చేస్తున్నామని, కొత్తగా సీఈఓ విచారణ చేసి అగ్రిమెంట్ చేస్తారని పాలకవర్గం తీర్మానం చేస్తుందని అధ్యక్షులు ప్రకటించారు. దీనిపై కలెక్టర్ గౌతమి కలుగజేసుకుని, వీటిపై విచారణ జరుగుతోందని, రిపోర్టు వస్తుందని తెలియజేశారు. మళ్లీ జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీ సభ్యులు మైకులు అందుకుని సప్లిమెంటరీ అగ్రిమెంట్‌ను రద్దుచేస్తున్నట్లు తీర్మానం చేస్తామని స్పష్టం చేశారు. ఇలా సుమారు గంట సేపు సప్లిమెంటరీ అగ్రిమెంట్‌పై హీట్ కొనసాగింది. ఈ అంశం జడ్పీ చైర్‌పర్సన్, జడ్పీటీసీలు వర్సెస్ జడ్పీ సీఈఓ, కలెక్టర్ అన్నట్లుగా చర్చ సాగింది.

వచ్చింది నలుగురు ఎమ్మెల్యేలే..

ఉమ్మడి జిల్లా నుంచి జడ్పీ సమావేశానికి నలుగురు ఎమ్మెల్యేలు మాత్రమే హాజరయ్యారు.హాట్ హాట్ డిబేట్ తర్వాత రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి మాట్లాడారు. రాప్తాడు నియోజవకర్గం పరిధిలో రూ.2.92 కోట్ల టెండర్ల పనుల పూర్తయ్యేలా చూడాలని కోరారు. ఇతర పెండింగ్ పనులు కూడా పురోగతి సాధించేలా చూడాలని అధికారులను కోరారు. తాగునీటి పనులకు గతంలో ప్రభుత్వం నుంచి డబ్బులు తెప్పించేవారని, ఈ ఏడాది జడ్పీ నుంచి అత్యవసరంగా వాడినట్లు స్పష్టమవుతోందని అనంతపురం ఎమ్మెల్యే అనంత వెంకట్రామిరెడ్డి అన్నారు. సత్యసాయి, శ్రీరామిరెడ్డి వాటర్ వర్క్స్‌కు జడ్పీ నుంచి వాడుకున్న రూ.5 కోట్లు లేదా రూ.6 కోట్ల నిధులను మళ్లీ జడ్పీకి ప్రభుత్వం నుంచి వచ్చేలా ప్రభుత్వానికి ఒక తీర్మానం పంపాలని సూచించారు. జడ్పీ సీఈఓ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ ఎప్పటికప్పుడు జడ్పీచైర్ పర్సన్‌కు అన్ని విషయాలు చెప్పాలని సూచించారు. మడకశిర బ్రాంచ్ కెనాల్‌కు నీళ్లు ఇవ్వాలని పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణ కోరారు. కదిరి నియోజకవర్గంలో ఆరు నెలల నుంచి సుమారు 3600 ఎకరాలకు 2590 మంది రైతులు అసైన్‌మెంట్ పట్టాల కోసం వేచి చూస్తున్నారని కదిరి ఎమ్మెల్యే సిద్ధారెడ్డి అన్నారు. ఆర్డీఓ, జాయింట్ కలెక్టర్ స్థాయిలో పెండింగ్‌లో ఉన్నాయని, ఎన్నికల కోడ్‌లోపు రైతులకు భూములకు పట్టాలు వచ్చేలా చూడాలని కోరారు. అనంతరం పంచాయతీ రాజ్, ఆర్ అండ్‌బీ తదితర అంశాలపై చర్చించారు.

అన్న వేసిన అభివృద్ధి బాటలు..

తూమకుంట పారిశ్రామిక వాడకు శ్రీకారం

నేడు వేల మందికి ఉపాధి

ఈ ప్రాంతంతో నందమూరి కుటుంబానికి విడదీయరాని బంధం

నేడు ఎన్టీఆర్ వర్ధంతి

పెద్దఎత్తున అన్నదానానికి ఏర్పాట్లు

హిందూపురం, జనవరి 17: ఎన్టీఆర్ లోకం విడిచి 26 ఏళ్లవుతున్నా ఇప్పటికీ ఆయన పేరు ఇక్కడ తరిస్తూనే ఉంటారు. ఈ ప్రాంత అభివృద్ధికి బాటలు వేసింది ఆయనే. ఎన్టీఆర్ ఇక్కడ పుట్టలేదు, పెరగలేదు అయినా హిందూపురంతో ఆ కుటుంబానికి ఉన్న బంధం అలాంటిది. అప్పట్లో నియోజకవర్గ అభివృద్ధికి ఆయన చేసిన సేవల కారణంగానే ఇప్పటికీ అన్న పేరును జపిస్తుంటారు. సంక్షేమాంధ్రకు నిలువెత్తు చిరునామా అన్న ఎన్టీఆర్. సంక్షేమ పథకాలతోపాటు పాలన సంస్కరణలతో కొత్త శకానికి నాంది పలికారు. తెలుగుదేశం పార్టీని స్థాపించి తొమ్మిది నెలల్లోనే అధికారం చేజిక్కుంచుకున్న ఘనుడు. ఆయన పుట్టింది క్రిష్ణాజిల్లాలో అయినా హిందూపురానికి నందమూరి కుటుంబంతో విడదీయరాని బంధం ఏర్పడిందని చెప్పవచ్చు. దేశ రాజకీయాలకు కేంద్రబిందువుగా రాజకీయ ఉద్దండులను, స్వాతంత్ర్య సమరయోధులను అందించిన గడ్డగా హిందూపురానికి పేరుంది. హిందూపురం అంటే గుర్తుకొచ్చేది నందమూరి పురం. మహానటుడు నందమూరి తారక రామారావు టీడీపీని స్థాపించి ఇక్కడి నుంచే మూడుసార్లు పోటీచేసి తిరుగులేని విజయం సాధించారు. రెండుమార్లు ముఖ్యమంత్రి పదవిని అధిరోహించారు. రాష్ట్రంలోనే వెనుకబడిన ఉమ్మడి అనంత జిల్లా. హిందూపురం రాష్ట్ర సరిహద్దులో ఉండటంతో ఇక్కడ అభివృద్ధి చెప్పనక్కర్లేదు. అలాంటి పరిస్థితుల్లో హిందూపురాన్ని ఎన్టీఆర్ ఎంచుకుని పోటీచేశారు. ఆయనకు నియోజకవర్గ ప్రజలు తిరుగులేని ఆధిక్యాన్ని కట్టబెట్టారు. దీంతో ఎలాగైనా నియోజకవర్గానికి ప్రత్యేక స్థానం తీసుకురావాలనే ఉద్దేశంతో ఎన్టీఆర్ హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు.

ఎన్నో గుర్తుండిపోయాయి..

పురం నియోజకవర్గంలో విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాలకు పెద్దపీట వేశారు. లేపాక్షిలో నవోదయ, ఏపీఆర్ఎస్, మలుగూరు, కొడిగెనహళ్లిలో ఏపీఆర్ఎస్ పాఠశాలలు ఏర్పాటు చేసి, నిరుపేదలకు ఉన్నత విద్య అందించారు. ఈ విద్యాసంస్థల్లో చదివి ఎంతో మంది ఉన్నత శిఖరాలను అధిరోహించారు. జిల్లాలో నిరుద్యోగ సమస్య పరిష్కరించాలనే ఉద్దేశంతో తూమకుంట వద్ద పారిశ్రామిక వాడ ఏర్పాటుకు శ్రీకారం చుట్టారు. అది నేడు భారీ పారిశ్రామిక వాడగా గుర్తింపు పొందింది. పట్టణ పరిధిలోని మోడల్‌కాలనీ, ఆటోనగర్ స్థాపించడంలో ఎన్టీఆర్ భూమిక మరువలేనిది. ఎంజీఎం క్రీడామైదానంలో ఇండోర్ స్టేడియం ఏర్పాటు చేసింది కూడా ఎన్టీఆరే. హిందూపురంలోని ఆస్పత్రిని జిల్లా ఆస్పత్రిగా మార్చి, స్థానిక ఎమ్మెల్యే చైర్మన్‌గా ఉండాలనే సంకల్పంతో అప్పట్లో ప్రత్యేక జీఓ తీసుకొచ్చారంటే ఈ ప్రాంతంపై ఎంత మక్కువ ఉందో అర్థం చేసుకోవచ్చు. నియోజకవర్గంలో గూడులేని ప్రతి నిరుపేదకు పక్కా ఇల్లు నిర్మింపజేసి మారుమూల గ్రామాలకు సైతం రోడ్లను విస్తరించింది ఎన్టీఆరే.

ప్రత్యేక అధికారిగా ఐఏఎస్

ప్రస్తుత పరిస్థితుల్లో ముఖ్యమంత్రులు తమ నియోజకవర్గాల్లో మరో వ్యక్తికి అవకాశం లేకుండా వారే చూసుకుంటారు. ఆనాడు ముఖ్యమంత్రిగా ఉన్న ఎన్టీఆర్ మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరించారు. తాను ఎక్కడున్నా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ఆగకూడదన్న ఉద్దేశంతో ఐఏఎస్ అధికారిని ప్రత్యేకాధికారిగా నియమించారు. ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సైతం రెండుమూడు రోజులపాటు ఇక్కడే మకాంవేసి, అభివృద్ధి పనులను పరుగులు పెట్టించేవారు.

తగ్గని అభిమానం

ఎన్టీఆర్ మూడుసార్లు ఇక్కడి నుంచి గెలుపొందారు. ఆయన మరణానంతరం కూడా ఆ కుటుంబంపై నియోజకవర్గ ప్రజలకు అభిమానం తగ్గలేదు. ఆయన తరువాత తనయుడు హరికృష్ణ ఇక్కడి నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, కార్మిక శాఖ మంత్రిగా పని చేశారు. ప్రస్తుతం నందమూరి బాలకృష్ణకు సైతం రెండుసార్లు నియోజకవర్గ ప్రజలు పట్టంకట్టారు. వీరితోపాటు పార్టీని స్థాపించిన అనంతరం రంగనాయకులు, సీసీ వెంకటరాముడు, అబ్దుల్‌ఘని కేవలం ఎన్టీఆర్ బొమ్మతో గెలిచారని చెప్పవచ్చు. పార్టీ ఆవిర్భావం నుంచి ఇప్పటి వరకు హిందూపురంలో టీడీపీ తప్ప మరో పార్టీకి అవకాశం లేకుండా పట్టం కడుతూ వస్తున్నారంటే ఎన్టీఆర్‌పై ఈ ప్రాంత ప్రజలకున్న అభిమానం ఏపాటిదో తెలుస్తోంది.

నేడు అన్నదానం

ఎన్టీఆర్ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం హిందూపురంలో వివిధ కార్యక్రమాలు చేపడుతున్నారు. అన్నదానం చేయనున్నారు. ఎన్టీఆర్ విగ్రహాల వద్ద నివాళులు అర్పించనున్నట్లు నాయకులు తెలిపారు. పలు సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు.

పురం అభివృద్ధికి ఎన్టీఆర్ ఎనలేని కృషి



పురంలోని ఎన్టీఆర్ విగ్రహం

ఎక్కడాలేని విధంగా విగ్రహాలు


ప్రధాన పట్టణాల్లో సైతం మహనీయుల ఒకటి రెండు విగ్రహాలుంటాయి. హిందూపురం పట్టణంలో నాలుగుచోట్ల విగ్రహాలను ఏర్పాటు చేశారు. మొదట పాతబస్టాండు, తరువాత గురునాథ్ సర్కిల్, సూగూరు అంజనేయస్వామి క్రాస్‌వద్ద, సూరప్పకట్ట మీద ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. దీంతోపాటు లేపాక్షి, చిలమత్తూరు, తూమకుంట చెక్‌పోస్టు, మిట్టమీదపల్లిలో కూడా ఎన్టీఆర్ విగ్రహాలు ఏర్పాటు చేశారు. నియోజకవర్గంలో అత్యధికంగా ఎన్టీఆర్ విగ్రహాలున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే బాలకృష్ణ ప్రత్యేక చొరవ తీసుకుని నిర్మింపజేసిన మాత శిశు సంరక్షణ కేంద్రానికి సైతం బసవతారకం పేరు పెట్టడం విశేషం.

వర్సిటీలకు కొత్త వీసీలు

జేఎన్‌టీయూకి శ్రీనివాసరావు, ఎస్కేయూకి హుస్సేన్‌రెడ్డి నియామకం



జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు



ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

అనంతపురం సెంట్రల్, జనవరి 17: జిల్లాలో జేఎన్‌టీయూ, ఎస్కే యూనివర్సిటీలకు కొత్త వీసీలను నియమిస్తూ రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్, ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్యామల రావు బుధవారం ఉత్తర్వులు జారీచేశారు. జేఎన్‌టీయూ వీసీగా ప్రొఫెసర్ జీవీఆర్ శ్రీనివాస రావు, ఎస్కేయూ వీసీగా ప్రొఫెసర్ కె.హుస్సేన్‌రెడ్డి నియమితులయ్యారు. జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు ప్రస్తుతం విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీలో సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్నారు. ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి ఎస్కేయూలోని రసాయనశాస్త్ర విభాగం ప్రొఫెసర్‌గా రిటైర్ అయ్యారు. జేఎన్‌టీయూ వీసీగా రంగజనార్దన పదవీకాలం బుధవారంతో ముగిసింది. ఎస్కేయూ ఇన్‌చార్జ్‌వీసీగా రామకృష్ణారెడ్డి పదవీ కాలం నవంబరులో ముగియడంతో యోగివేమన వీసీ ప్రొఫెసర్ సుధాకర్ ఇన్‌చార్జ్ వీసీగా పనిచేస్తున్నారు.

ఎస్కేయూ వీసీ బాధ్యతల స్వీకరణ...

ఎస్కేయూ వీసీగా ప్రొఫెసర్ హుస్సేన్‌రెడ్డి బుధవారం రాత్రి బాధ్యతలు స్వీకరించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఎంవీ లక్ష్మయ్య ఆధ్వర్యంలో వీసీగా సంతకం చేసి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థి సంఘాల నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.



ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి

25లోపు పశుసంవర్ధక సహాయకులకు పోస్టింగ్

అనంతపురం అర్బన్, జనవరి 17: ఉమ్మడి అనంత జిల్లాలో ఖాళీగా ఉన్న పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు సంబంధించి అర్హులైన అభ్యర్థులకు ఈనెల 25వ తేదీలోగా పోస్టింగ్‌లు ఇస్తామని ఆ శాఖ జేడీ సుబ్రహ్మణ్యం బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని 473 పశుసంవర్ధక సహాయకుల పోస్టులకు గతేడాది డిసెంబరులో ఆన్‌లైన్ పరీక్షలు నిర్వహించగా 919 మంది హాజరయ్యా రన్నారు. రోస్టర్, మెరిట్ ఆధారంగా అర్హుల జాబితాను సిద్ధం చేసినట్లు తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం విద్య, జనవరి 17: ఐసీడీఎస్‌లో పలు విభాగాల పరిధిలో ఖాళీగా ఉన్న రెండు పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పీడీ శ్రీదేవి బుధవారం ప్రకటనలో తెలిపారు. జిల్లా బాలల పరిరక్షణ సమితిలో సోషల్‌వర్కర్-1, శిశుగృహంలోని డాక్టర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీకి కలెక్టర్ ఆదేశాలిచ్చారన్నారు. ఉద్యోగార్హతలు, జీతం, దరఖాస్తు విధానం వివరాలు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌లో శుక్రవారం నుంచి అందుబాటులో ఉంటాయన్నారు. ఈనెల 27 సాయంత్రం ఐదు గంటల వరకూ ఐసీడీఎస్‌లో పీడీ కార్యాలయంలో దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు.

చేనేతల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి



మాట్లాడుతున్న సత్యనారాయణ మూర్తి

అనంతపురం విద్య, జనవరి 17: దేశంలో చేనేత రంగాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేసి, చేనేతలపై నిర్లక్ష్యం చూపుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి మండిపడ్డారు. బుధవారం స్థానిక లలిత కళా పరిషత్‌లో నిర్వహించిన చేనేత రంగం నిర్మాణ మహాసభలో ఆయన మాట్లాడారు. మిషన్ వస్త్రాలు వచ్చాక చేనేత వస్త్రాలను చిన్నచూపు చూస్తున్నారన్నారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో చేనేతలకు వాగ్దానాలు ఇవ్వడం మినహా... వారిని ఆదుకున్న దాఖలాలు లేవని మండిపడ్డారు. ప్రధాని మోడీకి చిత్తశుద్ధి ఉంటే... కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులందరూ వారానికి ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించి విధులకు వచ్చేలా జీవో విడుదల చేయాలని, దీంతో చేనేత రంగం మరింత బాగుపడుతుందని అన్నారు. సీఎం జగన్ నేతన్న నేస్తం, అమ్మఒడి, చేయూత అంటూ చాలా పథకాలు పెట్టారే కానీ... ఏ ఒక్క రంగాన్నీ ఆదుకున్న పరిస్థితి లేదన్నారు. చేనేతలను ప్రభుత్వాలు ఆదుకోవాలని, వారి సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. ఈ నెల 20,21 తేదీల్లో గుంటూరులోని మంగళగిరిలో రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, చేనేత కార్మిక రంగం జిల్లా ప్రధాన కార్యదర్శి గోవిందు, జిల్లా కన్వీనర్ శ్రీరాములు, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజారెడ్డి, ఇతర నేతలు రాజారెడ్డి, లక్ష్మయ్య, రాజేష్ గౌడ్, రమణయ్య, అల్లిపీరా పాల్గొన్నారు.

కసాపురం దేవస్థాన ఈఓగా సాగర్‌బాబు



విధుల్లో చేరుతున్న సాగర్‌బాబు

గుంతకల్లు, జనవరి17: కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం ఈఓగా సాగర్‌బాబు బుధవారం ఉదయం విధుల్లో చేరారు. శ్రీకాళహస్తి ఈఓగా పనిచేసిన ఈయన కసాపురం ఆలయ ఈవోగా నియమితులయ్యారు. కసాపురం ఆలయంలో చోరీ జరిగిన నేపథ్యంలో ఇక్కడ పనిచేసిన ఈఓ వెంకటేశ్వరరెడ్డిని బదిలీచేసి కర్నూలు ఏసీ గురుప్రసాద్‌ను కసాపురం తాత్కాలిక ఈఓగా నియమించారు. ఈ నేపథ్యంలో సాగర్‌బాబును ఇక్కడకు ఈఓగా పంపగా, ఆయన విధులను స్వీకరించారు.

స్వాధీనం చేసుకున్న మద్యం ధ్వంసం

అనంతపురం క్రైం, జనవరి 17: పలు కేసుల్లో స్వాధీనం చేసుకున్న మద్యాన్ని సెబ్ అడిషినల్ ఎస్పీ రామక్రిష్ణ ఆధ్వర్యంలో బుధవారం టీవీ టవర్ సమీపంలో సెబ్ పోలీసులు ధ్వంసం చేశారు. అనంతపురం సెబ్ స్టేషన్‌లో నమోదైన 11 కేసుల్లోని రూ.3,22,419 విలువైన 7,946 మద్యం బాటిళ్లు, బుక్కరాయసముద్రం సెబ్‌స్టేషన్‌లో తొమ్మిది కేసుల్లో స్వాధీనం చేసుకున్న రూ.18,919 విలువైన 278 బాటిళ్లు, అనంతపురం రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసులో స్వాధీనం చేసుకున్న రూ. 84,840 విలువైన 2,122 మద్యం ప్యాకెట్లను ధ్వంసం చేశారు. కార్యక్రమంలో అనంతపురం సెబ్ ఇన్‌స్పెక్టర్ రవిచంద్ర, బుక్కరాయసముద్రం సెబ్ ఇన్‌స్పెక్టర్ హసీనాభాను, రూరల్ ఎస్ఐ సిబ్బంది పాల్గొన్నారు.




కొత్తగాదికుంటలో మాజీ మంత్రి పరిటాల సునీత, వెంకటాంపల్లిలో బండారు శ్రావణి ప్రచారం

జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి

చంద్రబాబుతోనే అభివృద్ధి, సంక్షేమం: మాజీ మంత్రి పరిటాల సునీత

రామగిరి, జనవరి 17: జగన్ పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందని మాజీ మంత్రి పరిటాల సునీత ధ్వజమెత్తారు. బుధవారం మండలంలోని కొత్తగాదికుంటలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి వెళ్లి టీడీపీ ప్రకటించిన మిని మ్యానిఫెస్టో, సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ పాలనలో రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాప్తాడు నియోజకవర్గంలో అభివృద్ధి పూర్తిగా కుంటుపడిందన్నారు. 2019 ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి వచ్చి ఉంటే ఈ నియోజకవర్గంలో ప్రతి ఎకరా నీటితో తడిసేదన్నారు. వైసీపీ పాలనలో ప్రాజెక్టులు, పరిశ్రమలు ముందుకు సాగడం లేదన్నారు. ఉన్న నీటిని సద్వినియోగం చేసుకోలేని స్థితిలో ప్రభుత్వం ఉందన్నారు. తమ హయాంలో రూ.5 వేలకోట్లతో అభివృద్ధి, సంక్షేమం కార్యక్రమాలను చేపట్టామన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబు మాత్రమే రాష్ట్రాన్ని కాపాడగలరన్నారు. ఇక ఈ ప్రభుత్వానికి మూడు నెలలు మాత్రమే గడువు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ సుధాకర్, ప్రధాన కార్యదర్శి మారుతీ ప్రసాద్, రామ్మూర్తినాయుడు, శ్రీధర్ నాయుడు, మాదాపురం శంకర, పోతన్న పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక

కొత్తగాదికుంట గ్రామానికి చెందిన వైసీపీ కార్యకర్తలు మాజీ మంత్రి పరిటాల సునీత సమక్షంలో టీడీపీలో చేరారు. వైసీపీ కార్యకర్తలు చింతకాయల రమణ, చింతకాయల లింగమ్మ, చింతకాయల వీరేశ్, చింతకాయల నరేశ్ టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.

నేడు కక్కలపల్లి కాలనీలో...

అనంతపురంరూరల్: మండలంలోని కక్కలపల్లి కాలనీలో గురువారం మధ్యాహ్నం 2 గంటలకు బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల కన్వీనర్ జింకాసూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి పాముురాయి రఘు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి మాజీ మంత్రి పరిటాల సునీత హాజరవుతారని, మండలంలోని తెలుగు దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అనుబంధ సంఘాల నాయకులు కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బండారు శ్రావణి ఆధ్వర్యంలో...

నార్పల : ఇక ఈ వైసీపీ చీకటి పాలనకు రోజులు దగ్గర పడ్డాయని, రాబోయే ఎన్నికల్లో రాష్ట్ర ప్రజలు జగన్‌రెడ్డిని తరిమి కొట్టే సమయం ఆసన్నమైందని శింగనమల టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బండారు శ్రావణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని వెంకటాంపల్లి గ్రామంలో పొలం బాట కార్యక్రమం నిర్వహించారు. పొలాల్లోని రైతులు, కూలీలతో మాట్లాడారు. నిత్యావసర సరుకుల ధరలు విపరీతంగా పెరగడంతో తమ కూలి డబ్బులన్నీ వాటికే ఖర్చు చేట్టాల్సి వస్తోందని కూలీలు ఆమె వద్ద వాపోయారు. త్వరలోనే టీడీపీ అధికారంలోకి వస్తుందని, అన్ని వర్గాల వారికి న్యాయం చేస్తామని ఆమె భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

టీడీపీలో అందరికీ సమన్యాయం

● మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ● 200 ముస్లిం కుటుంబాలు పార్టీలో చేరిక

అనంతపురం అర్బన్, జనవరి 17 : తెలుగు దేశం పార్టీలో అందరికీ సమన్యాయం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి పేర్కొన్నారు. మాజీ డిప్యూటీ మేయర్ గంపన్న ఆధ్వర్యంలో లక్ష్మీనగర్‌కు చెందిన 200 ముస్లిం మైనార్టీ కుటుంబాలు టీడీపీలో చేరారు. బుధవారం అనంతపురం అర్బన్ టీడీపీ కార్యాలయంలో వారిని ప్రభాకర్ చౌదరి పార్టీ కండవాలు కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. అందరూ సమన్వయంతో పనిచేసి రాబోవు ఎన్నికల్లో టీడీపీ విజయం కోసం కృషి చేయాలన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతి రోజున రక్తదాన శిబిరం

ఎన్టీరామారావు వర్ధంతిని పురష్కరించుకొని గురువారం రక్తదాన శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే వైకుంఠం ప్రభాకర్ చౌదరి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక లలితకళాపరిషత్‌లో ఉదయం 9.30 గంటలకు రక్తదాన కార్యక్రమంతో పాటు అనంతపురం ప్రభుత్వాసుత్రిలో రోగులకు పండ్లు, బెడ్లు, అన్నదానం చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు శ్రేణులు పెద్ద ఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు.



ప్రభాకర్ చౌదరి సమక్షంలో టీడీపీలో చేరిన ముస్లిం మైనార్టీలు

కమిషనర్‌గా మేఘ స్వరూప్ బాధ్యతలు



అనంతపురం క్రైం, జనవరి 17: నగర పాలక కమిషనర్‌గా మేఘస్వరూప్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మేఘస్వరూప్ స్వస్థలం కర్నూలు నగరం కృష్ణానగర్. చిత్తూరు అసిస్టెంట్ కలెక్టర్ (ట్రైనీ కలెక్టర్)గా పనిచేసి వెయిటింగ్‌లో ఉన్న మేఘ స్వరూప్‌ను అనంతపురం నగరపాలిక కమిషనర్‌గా నియమించారు. ఇదివరకు కమిషనర్‌గా పనిచేసిన భాగ్యలక్ష్మి రిలీవ్ అవుతూ... నూతన కమిషనర్‌కు బాధ్యతలు అప్పగించారు. నూతన కమిషనర్‌కు అడిషనల్ కమిషనర్ రమణారెడ్డి, డిప్యూటీ కమిషనర్ సావిత్రి, ఇన్‌చార్జ్ ఎస్ఈ రామ్మోహన్‌రెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య శిబిరం పరిశీలన

నగరంలోని బుడ్డప్పనగర్‌లో నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని కమిషనర్ బుధవారం పరిశీలించారు. వాటిలో అందిస్తున్న సేవలపై డీఐఓ డాక్టర్ యుగంధర్, అదనపు కమిషనర్ రమణారెడ్డి కమిషనర్‌కు వివరించారు. నగరంలో మొత్తం 10 పట్టణ ఆరోగ్య కేంద్రాలున్నాయని, కొత్తగా మరో ఆరింటిని ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

అవినీతిని ప్రోత్సహిస్తున్న వైసీపీ ప్రభుత్వం

అనంతపురం సెంట్రల్, జనవరి 17: విశ్వవిద్యాలయాల్లో వైసీపీ ప్రభుత్వం అవినీతి, అక్రమాలను ప్రోత్సహిస్తోందని విద్యార్థి సంఘాల నాయకులు మండిపడ్డారు. బుధవారం జేఎన్‌టీయూ పరిపాలనా భవనం వద్ద ఆర్‌వైఎ, ఏఐఎస్ఎ, పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు వేమన, బండారు శంకర్ మాట్లాడుతూ... వర్సిటీల్లో ఐదేళ్లుగా రాజకీయజోక్యం పెరిగిందన్నారు. దీంతో అర్హత, అనుభవంలేని వారు కీలకమైన పదవుల్లో ఉంటూ అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అదేవిధంగా సిబ్బందికి ప్రమోషన్‌లు కల్పించకుండా వివక్షకు పాల్పడుతున్నారని, ఇందుకు జేఎన్‌టీయూనే నిదర్శనమమని మండిపడ్డారు. రాష్ట్ర గవర్నర్ అధికారాలను విస్మరించి ఉన్నత విద్యామండలి అధికారి కనుసన్నుల్లో వర్సిటీల పాలన కొనసాగుతోందని, దీంతో అవినీతి పెట్రేగుతోందని అన్నారు. కార్యక్రమంలో నాయకులు మల్లికార్జున, నాగేంద్ర, ఇస్మాయిల్, కుల్లాయిస్వామి పాల్గొన్నారు.

పి కొత్తపల్లిలో వైభవంగా దేవర



ఆత్మకూరు జనవరి 17: మండలంలోని పీ కొత్త పల్లి గ్రామంలో బుధవారం దేవరను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. కొన్నేళ్ల తరువాత గ్రామంలో దేవర నిర్వహిస్తుండటంతో ఇతర ప్రాంతాల నుంచి వేలాది మంది తరలివచ్చారు. ప్రతి ఇంటి పండుగ వాతావరణం నెలకొంది. మాజీ మంత్రి పరిటాల సునీత ముఖ్య అతిథిగా హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆమె వెంట మండల ఇన్‌చార్జి బాలాజీ, మండల కన్వీనర్ శ్రీనివాసులు, రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి నారాయణ స్వామి, పార్లమెంటు అధికార ప్రతినిధి, శశాంక చౌదరి, మండల మాజీ కన్వీనర్లు క్రిష్ణమోహన్ చౌదరి, సూరి, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

పందెం రాయుళ్ల అరెస్టు

శింగనమల, జనవరి 17: మండలంలోని ఆకులేడులో బుధవారం సాయంత్రం కోడి పందెం ఆడుతున్న ఏడుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. వారి నుంచి రూ. 3200 నగదు, ఐదు బైక్‌లు, ఐదు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి

పామిడి, జనవరి 17: మండలకేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లమడి తిరుపాలు(57)అనే రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని జీ కొట్టాల గ్రామానికి చెందిన కల్లమడి తిరుపాలు పొగరూరు గ్రామ సమీపాన గల పొలం నుంచి సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దే రాడు. వై జంక్షన్ సమీపానికి రాగానే పామిడిలోకి తిరిగేందుకు యత్నిస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపైకి ఎగిరిపడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

గుత్తి, జనవరి 17: గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి శివాజీ(30) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్ఐ నాగప్ప బుధవారం తెలిపారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన శివాజీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది తురకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

జేఎన్‌టీయూ వీసీకి వీడ్కోలు సన్మానం

అనంతపురం సెంట్రల్, జనవరి 17: జేఎన్‌టీయూ వీసీగా రంగజనార్ధన మూడేళ్ల పదవీకాలంలో ముగియడంతో రిజిస్ట్రార్ శశిధర్ అధ్యక్షతన ఉద్యోగులు బుధవారం ఆయనకు సన్మానసభ నిర్వహించారు. తనకు సహకరించిన ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో రెక్టార్ విజయకుమార్, పలువురు వర్సిటీ డైరెక్టర్లు, కళాశాల ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణకాంతి, విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఆప్కాస్ కార్యాలయం ప్రారంభోత్సవం : జేఎన్‌టీయూ నూతన పరిపాలన భవనంలో ఆప్కాస్ ఉద్యోగుల అసోసియేషన్ కొత్త కార్యాలయాన్ని వీసీ రంగజనార్ధన ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రెజరర్ రహంతుల్లా, ఉపాధ్యక్షుడు క్రిష్ణయ్య, సభ్యులు మధుసూదన్‌రెడ్డి, పవన్‌కుమార్, రవిశంకర్, శశికల, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

పలువురు ప్రొఫెసర్ల బదిలీ : వీసీగా రంగజనార్ధన పదవీకాలం ముగింపురోజు పలువురు ప్రొఫెసర్లను బదిలీ చేస్తూ రిజిస్ట్రార్ శశిధర్ ఉత్తర్వులు జారీచేశారు. పులివెందుల ఇంజనీరింగ్ కళాశాల నుంచి ప్రొఫెసర్ వసంధరను, కలికిరి ఇంజనీరింగ్ కళాశాల నుంచి ప్రొఫెసర్ బి.లలితను అనంతపురం ఇంజనీరింగ్ కళాశాలకు బదిలీచేశారు. అదేవిధంగా కలికిరి ఇంజనీరింగ్ కళాశాల హెచ్‌ఓడీగా ప్రొఫెసర్ ఎస్.నసీరాను నియమించారు.



వీసీ రంగజనార్దనను సన్మానిస్తున్న అధికారులు

రేపు వేమన కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠ

అనంతపురం కల్చరల్, జనవరి 17: విశ్వకవి యోగివేమన జయంతిని పురస్కరించుకుని స్థానిక ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఎదురుగా యోగివేమన కాంస్య విగ్రహ పునఃప్రతిష్ఠ కార్యక్రమాన్ని శుక్రవారం ఉదయం 8 గంటలకు నిర్వహిస్తున్నట్లు యోగి వేమన రెడ్డి సేవాసంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నారాయణరెడ్డి, విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో క్లాక్‌టవర్ ముందు యోగివేమన విగ్రహం ఉండగా రోడ్డు విస్తరణ పనుల కారణంగా అక్కడి నుంచి మార్పు చేశారు. ఈ నేపథ్యంలో శుక్రవారం నిర్వహించే పునఃప్రతిష్ఠ కార్యక్రమానికి అన్నిరంగాలవారు విరివిగా పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

షర్మిల నియామకంపై సంబరాలు

అనంతపురం న్యూటౌన్ : పీసీసీ అధ్యక్షులుగా షర్మిల నియామకంపై అనంతలో స్థానిక నాయకులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. షర్మిల నాయకత్వంలో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆశయసాధనకు పోరాటం చేస్తామన్నారు. కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి రాహుల్‌గాంధీని ప్రధానిని చేయడమే లక్ష్యంగా పని చేస్తామని జిల్లా అధ్యక్షుడు బండ్లపల్లి ప్రతాప్‌రెడ్డి అన్నారు. నగరంలో ర్యాలీ చేపట్టి సంబరాలు చేసుకున్నారు. అదే విధంగా మాజీ పీసీసీ అధ్యక్షులు గిడుగు రుద్రరాజు సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడిగా నియమించడంపై హర్షం వ్యక్తం చేశారు కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు వాసు, నాయకులు పాల్గొన్నారు.

డీలర్‌పై చర్యలు తీసుకోండి

తహసీల్దార్, ఎస్ఐకి లబ్ధిదారుల ఫిర్యాదు

రాప్తాడు, జనవరి 17: స్టోర్ డీలర్ లక్ష్మన్నపై చర్యలు తీసుకోవాలని రాప్తాడు గ్రామానికి చెందిన వరికూటి రవి, ఆతని భార్య వరికూటి అలివేలమ్మ డిమాండ్ చేశారు. ఈ మేరకు రాప్తాడు తహసీల్దార్ మునివేలు, రాప్తాడు ఎస్ఐ మునీర్ అహ్మద్‌కు వారు బుధవారం ఫిర్యాదు చేశారు. మంగళవారం బియ్యం కోసం డీలర్ లక్ష్మన్న వద్దకు వెళ్లగా ఇతరులకు బియ్యం వేస్తూ... తమకు లేవని చెప్పాడని వాపోయారు. తమకెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నిస్తే.. వెళ్లి తహసీల్దార్‌నే అడగండని దురుసుగా ప్రవర్తిస్తున్నాడని తెలిపారు. బియ్యం ఇచ్చేది లేదని, ఎవరితో చెప్పుకుంటావో చెప్పుకోపో అని తమపై దాడికి యత్నించాడని వాపోయారు. గతంలో కూడా చాలా సార్లు ఇలాగే జరిగిందన్నారు. అధికారులు విచారించి వెంటనే డీలర్ లక్ష్మన్నపై చర్యలు తీసుకోవాలని కోరారు.

సమస్యలు పరిష్కరించాల్సిందే

బదులు పత్రాలతో అంగన్‌వాడీల నిరసన

శింగనమల, జనవరి 17: శింగనమల ఐసీడీఎస్ కార్యాలయంలో 404 మంది అంగన్‌వాడీలు తమకు అందిన షోకాజు నోటీసులకు బదులు పత్రాలు అందజేశారు. తమ సమస్యలు పరిష్కరించాల్సిందేనని నినాదాలు చేశారు. తహసీల్దార్ కార్యాలయం నుంచి ఆర్‌టీసీ బస్టాండ్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ మనహారం చేశారు. అనంతరం ఐసీడీఎస్ కార్యాలయం వద్ద షొకాజు నోటీసులకు అంగన్‌వాడీలు బదులు పత్రాలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అంగన్వాడీ నాయకురాలు రమణమ్మ, శ్యామలమ్మ, కాత్యాయణి, భారతి, ప్రమీలా, రత్నమ్మ, నాగేశ్వరి పాల్గొన్నారు.

చెన్నేకొత్తపల్లి : సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఓబులు ఆధ్వర్యంలో చెన్నేకొత్తపల్లిలో అంగన్‌వాడీలు నిరసన చేపట్టారు. దీక్షా శిబిరం నుంచి ఐసీడీఎస్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి బదులు పత్రాలను అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు లింగన్న, అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్షురాలు రమణమ్మ, కార్యదర్శి లక్ష్మీదేవి, ప్రసన్న, కోమల, సరస్వతి, అంబుజాక్షి తదితరులు పాల్గొన్నారు.

నార్పల : స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద అంగన్‌వాడీల సమ్మె కొనసాగించారు. నార్పల, పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి వచ్చిన అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు ర్యాలీ నిర్వహించారు. సీడీపీఓకు వినతి పత్రం అందజేశారు. ఇందులో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ నాయకులు శ్రీదేవి, విజయలక్ష్మి, జయలలిత, రామాంజినమ్మ, రేణుక, సుధామణి, వెంకటలక్ష్మి పాల్గొన్నారు.



నార్పలలో అంగన్‌వాడీల నిరసన ర్యాలీ




శింగనమలలో సంజాయిషీ పత్రాలతో నిరసన, సీకేపీలో సంజాయిషీ పత్రాన్ని అందజేస్తున్న నాయకులు, అంగన్‌వాడీలు

రాయలకు ఘన నివాళి



రాయల విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనంతపురం క్లాక్ టవర్, జనవరి 17: శ్రీకృష్ణదేవరాయులు జయంతి సందర్భంగా స్థానిక శ్రీకృష్ణదేవ రాయ భవన్‌లో ఆయన చిత్రప టం వద్ద బుధవారం పలువురు కాపు సంక్షే మ సేన నాయకులు నివాళులర్పించారు. అనంతరం ఎస్‌కేయూ ఆవరణం లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన కాపు సంక్షేమసేన నాయకులు వద్ద కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో కాపుసంక్షేమసేన నగర అధ్యక్షుడు, అర్బన్ బ్యాంకు డైరెక్టర్ రొళ్ల భాస్కర్, జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటనారాయణ, యువజన అధ్యక్షు డు నవీన్ కుమార్, కార్యదర్శి మోహన్, ఉపాధ్యక్షుడు తాతయ్య, నాయకులు చిన్నా, శీనా, శ్రీరాములు, ముని, రాయల్ చంద్రబాబు, మధుబాబు, లక్ష్మీనరసింహులు పాల్గొన్నారు.

అయోధ్య రామయ్య అక్షింతల పంపిణీ



లోలూరులో రాములోరి అక్షింతలను ఊరేగిస్తున్న భక్తులు

శింగనమల, జనవరి 17: మండలంలోని పలు గ్రామాల్లో అయోధ్య రామయ్య అక్షింతలను బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు. ఆకులేడు, లోలూరు, గురుగుంట్ల, రఘునాథపురం గ్రామాల్లో వాటిని ఊరేగిస్తూ... ఈ పంపిణీ చేపట్టారు.

నూర్ బాషాల సంఘం అధ్యక్షురాలిగా ఫాతిమా



మహిళా అధ్యక్షురాలితో సంఘం సభ్యులు

అనంతపురంరూరల్, జనవరి 17: సత్యసాయి జిల్లా నూర్ బాషా దూదేకుల ముస్లిం సంక్షేమ సంఘం మహిళా అధ్యక్షురాలిగా ఫాతిమాను ఎన్నుకొన్నారు. బుధవారం మండలంలోని ఆ సంఘం కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దాదాఖలందర్ అధ్యక్షతన ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆ సంఘం అనంతపురం జిల్లా అధ్యక్షుడు నబీరసూల్, గౌరవాధ్యక్షులు అభినయ్, మస్తాన్‌వలి, నిజాం, రహీం, దాదాఖలందర్, వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లిపీరా, కుల్లాయప్ప, షఫీ పాల్గొన్నారు.

22న ప్రత్యేక పూజలు

అనంతపురంరూరల్, జనవరి 17: అయోధ్యలో బాలరాముని విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా సోమవారం మండలంలోని సోములదొడ్డి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి 10 గంటల వరకు శ్రీరామ మూల మంత్రం జపం, శ్రీ హనుమాన్ చాలీసా పారాయణ, భజన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

20న త్రోబాల్ జట్ల ఎంపిక పోటీలు

అనంతపురం క్లాక్‌టవర్, జనవరి 17: త్రోబాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాప్తాడులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణంలో త్రోబాల్ సీనియర్ పురుషులు, మహిళల జట్లు ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా కార్యదర్శి రవి తెలిపారు. మరిన్ని వివరాలకు 80747 93673, 89781 37522ను సంప్రదించాలని కోరారు.

ఇది శ్మశానవాటికా.. డంపింగ్ యార్డా..?

అనంత ఎమ్మెల్యేపై జనసేన నాయకురాలు పెండ్యాల శ్రీలత ధ్వజం

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 17: నగరంలోని నవోదయకాలనీలో ఉన్న శ్మశానవాటికను డంపింగ్ యార్డుగా మార్చిన ఘనత ఎమ్మెల్యే అనంత వెంకటరామి రెడ్డిదేనని జనసేన పార్టీ రాయలసీమ రీజినల్ ఉమెన్ కో-ఆర్డినేటర్ పెండ్యాల శ్రీలత మండిపడ్డారు. బుధవారం ఆమె మహిళలతో మాటామంతి కార్యక్రమంలో భాగంగా నవోదయ కాలనీలో పర్యటించారు. శ్మశానవాటికలో పేరుకుపోయిన చెత్తాచెదారంతో తాము అనారోగ్యాలతో ఇబ్బం దులు పడుతున్నామని ఆ కాలనీ వాసులు వాపోయారు. దుర్వాసన భరించలేక శ్వాసకోశ ఇబ్బందులకు గురవుతు న్నారన్నారు. పెండ్యాల శ్రీలత మాట్లాడుతూ.. ఇదేనా రూ. 800 కోట్ల అభివృద్ధి అంటే అని అనంత ఎమ్మెల్యే అనంత వెంకటరామిరెడ్డిని ప్రశ్నించారు. ప్రజల నుంచి ప్రతి ఇంటికి నెలనెలా రూ. 150 చెత్త పన్ను వసూలు చేస్తున్నారు గానీ...శ్మశానవాటికలో ఉన్న చెత్త కనిపించడం లేదా ప్రశ్నిం చారు. ఇలాగైతే ప్రజల ఆరోగ్య పరిస్థితి ఏం కావాలని ఎమ్మె ల్యేను నిలదీశారు. త్వరలో మున్సిపల్ ఉన్నతాధికారులను కలిసి సమస్య పరిష్కారం కోసం చర్యలు తీసుకుం టామన్నారు. ఆమె వెంట నగర ప్రధాన కార్యదర్శి దరాజ్ బాషా, వీర మహిళలు లక్ష్మి, సరోజమ్మ, కల్పన, సానియా, అనురాధ ఉన్నారు.



శ్మశానవాటికలో చెత్తను పరిశీలిస్తున్న పెండ్యాల శ్రీలత

బైరెడ్డి సిద్ధార్థరెడ్డీ..! నోరు అదుపులో పెట్టుకో

జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు

అనంతపురం ప్రెస్‌క్లబ్, జనవరి 17: 'బైరెడ్డి సిద్ధార్థరెడ్డీ..!... నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడు... పవన్‌కళ్యాణ్, చంద్రబాబును విమర్శించే స్థాయి నీకులేదు..' అని జనసేన పార్టీ నగర అధ్యక్షుడు పొదిలి బాబురావు హెచ్చరించారు. బుధవారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ.. నారాయణపురం పంచాయతీలో వైసీపీ నిర్వహించిన ఎద్దుల పోటీలకొచ్చిన వైసీపీ నాయకుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి తన స్థాయికి మించి మాట్లాడారన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పవన్‌ను ఎదుర్కొనే దమ్ములేక వ్యక్తిగత విమర్శలు చేస్తుంటే.. బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఆయన అడుగులకు మడుగులొత్తే కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టారన్నారు. వైసీపీ ఓటమి ఖాయమైందని, ఆ అభద్రతాభావంతోనే బైరెడ్డి సిద్ధార్థరెడ్డి ఇలా దిగజారుడు విమర్శలు చేస్తున్నాడని అన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షుడు అంకె ఈశ్వరయ్య, జిల్లా కార్యదర్శులు అవుకు విజయ్‌కుమార్, ముప్పూరి కృష్ణ, నగర కార్యదర్శులు అంజి, ఆకుల అశోక్, నాయకులు విజయ్ దేవరాయల్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న పొదిలి బాబురావు

పులివెందుల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీదేవి



డాక్టర్ శ్రీదేవిని సత్కరిస్తున్న వైద్య కళాశాల సిబ్బంది

అనంతపురం టౌన్, జనవరి 17: అనంత వైద్యకళాశాలలో వైద్యశాస్త్ర విభాగాధిపతి (హెచ్‌ఓడీ) డాక్టర్ శ్రీదేవి పులివెందుల మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగోన్నతి పొందారు. ఇక్కడి ప్రిన్సిపాల్ డాక్టర్ నీరజ ఉద్యోగ విరమణ పొందగా ఏడు నెలలు పాటు శ్రీదేవి ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్‌గా విధు లు నిర్వహించారు. ప్రస్తుతం డాక్టర్ శ్రీదేవిని పులివెందుల మెడికల్ కళాశాలకు ప్రిన్సిపాల్‌గా నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. దీంతో బుధవారం ఆమెను అనంత వైద్య కళాశాలలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డా క్టర్ మాణిక్యాలరావు, వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ సుబ్రహ్మణ్యం, షారోన్ సోనియా, కళాశాల వైద్యులు శ్యాం ప్రసాద్, శంషాద్ బేగం, సంధ్య, సుచిత్రశౌరి, సరళ, దుర్గ, శంకర్, మధుసూదన్, వాల్మీకి శ్రీనివాస్, నిహారిక, సుమాస్ చంద్రబోస్, సుచన, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరదేశీనాయుడు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ల సీజ్

అనంతపురం న్యూటౌన్ : స్థానిక గుత్తిరోడ్డు మార్కెట్ యార్డ్ వద్ద ఉన్న రాజేశ్వరి హోటల్‌లో విజిలెన్స్ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. నిబంధనలకు విరుద్ధంగా ఉన్న మూడు సిలిండర్లను సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు సీఐ సాయిప్రసాద్ తెలిపారు. దాడుల్లో ఏఈఈ రాజశేఖర్, రెవెన్యూ అధికారి మహబూబ్ బాషా, సిబ్బంది పాల్గొన్నారు.

జేసీపీఆర్ వద్ద సమస్యల ఏకరువు



మురుగు నీటి సమస్య వివరిస్తున్న లక్ష్మీదేవి

పెద్దవడుగూరు, జనవరి17: మండలంలో బస్సు యాత్ర నిర్వహిస్తున్న తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వద్ద మిడుతూరు ప్రజలు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. గ్రామంలో డ్రైనేజీ, రోడ్ల సమస్యలు అధికంగా ఉన్నాయని అధికారులకు ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడం లేదని వాపోయారు. హెచ్చెల్సీ నీరు రాకపోవడంతో పంటలు ఎండిపోయాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. మిడుతూరులోని దళితవాడలో జేసీతో లక్ష్మీదేవి మాట్లాడుతూ మురికినీటి సమస్య అధికంగా ఉందని కాలువలు లేక ఇబ్బందులు పడుతున్నామని వాపోయింది. మరొక దళిత వాడకు వెళ్లిన జేసీతో రాములమ్మ మాట్లాడుతూ విద్యుత్ సమస్య అధికంగా ఉందని ఎప్పుడు వస్తుందో ఎప్పుడు పోతుందో తెలియడం లేదని తెలిపింది. మొదటిరోజు కావడం ఆపై మధ్యాహ్నం పైగా మిడుతూరుకు రావడంతో ఒక గ్రామానికే జేసీ ప్రభాకర్‌రెడ్డి బస్సుయాత్ర పరిమితమైంది.

టీడీపీలో చేరిక



పార్టీలో చేరిన వారితో జేసీ అశ్మిత్‌రెడ్డి

పెద్దవడుగూరు, జనవరి17: మండలకేంద్రానికి చెందిన వైసీపీ సానుభూతిపరులు బుధవారం టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరారు. వారికి అశ్మిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రజావ్యతిరేక విధానాల వల్ల విసిగిపోయిన ప్రజలు స్వచ్ఛందంగా టీడీపీలో చేరుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సతీ‌ష్‌రెడ్డి, సురేష్, తిలక్‌కుమార్‌రెడ్డి, చిరంజీవులు పాల్గొన్నారు.

టీ స్టాల్‌లో చోరీ

పుట్లూరు, జనవరి17: మండలంలోని ఏ. కొండాపురం గ్రామంలోని ప్రధాన రహదారిలో ఉన్న వెంకటకృష్ణ టీస్టాల్‌లో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగినట్లు బాధితుడు తెలిపారు. టీస్టాల్‌కు ఉన్న షట్టర్ తాళాలు పగలగొట్టి సిగరెట్ బండిళ్లతోపాటు రూ.30 వేలు గుర్తుతెలియని వ్యక్తులు ఎత్తుకెళ్లినట్లు తెలిపారు.

టీడీపీ కార్యకర్తకు పీజేఆర్ నివాళి

పామిడి, జనవరి 17: పట్టణంలోని బెస్తవీధిలో నివాసం ఉంటున్న టీడీపీ సీనియర్ కార్యకర్త మెహబూబ్‌బాషా తల్లి దస్తగిరమ్మ మృతదేహం వద్ద టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి నివాళులర్పించారు. దస్తగిరమ్మ కుటుంబం ముందు నుంచి టీడీపీకి మద్దతుగా నిలిచారన్నారు. టీడీపీ బలోపేతానికి మెహబూబ్‌బాషా పనిచేశారన్నారు. దస్తగిరమ్మ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో రైతు మృతి



మృతుడు కల్లమడి తిరుపాలు(ఫైల్)

పామిడి, జనవరి 17: మండలకేంద్రంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కల్లమడి తిరుపాలు(57)అనే రైతు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... మండలంలోని జీ కొట్టాల గ్రామానికి చెందిన కల్లమడి తిరుపాలు పొగరూరు గ్రామ సమీపాన గల పొలం నుంచి సాయంత్రం తన ద్విచక్ర వాహనంపై ఇంటికి బయల్దేరాడు. వై జంక్షన్ సమీపానికి రాగానే పామిడిలోకి తిరిగేందుకు యత్నిస్తుండగా వెనుక నుంచి గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. దీంతో రోడ్డుపైకి ఎగిరిపడ్డాడు. తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని పామిడి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు

లారీ ఢీకొని మరొకరు..

యాడికి, జనవరి 17: మండలంలోని నిట్టూరు గ్రామం వద్ద లారీ, బైక్ ఢీకొన్న సంఘటనలో కంబగిరిస్వామి (45) బుధవారం మృతి చెందాడు. సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన వివరాలమేరకు మండలంలోని నిట్టూరు గ్రామానికి చెందిన కంబగిరిస్వామి అల్ట్రాటెక్ సిమెంట్ ఫ్యాక్టరీకి చెందిన ప్రైవేట్ జీపు డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం మధ్యాహ్నం వ్యక్తిగత పనుల నిమిత్తం యాడికికి వచ్చి తిరిగి సొంత గ్రామానికి వెళుతున్న సమయంలో వెనుక నుంచి లారీ ఢీకొంది. తీవ్రంగా గాయపడ్డ కంబగిరిస్వామిని తాడిపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతునికి భార్య వరలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు.

రైల్వే గేట్‌ను ఢీకొన్న వ్యక్తి



ట్రాక్‌కు అడ్డంగా పడ్డ గేటు, ఇన్‌సెట్‌లో గాయపడ్డ వ్యక్తి

గుత్తి, జనవరి 17: పట్టణ శివారులో కర్నూలు రోడ్డులోని రైల్వే గేట్‌ను ఓ వ్యక్తి మద్యం మత్తులో ద్విచక్రవాహనంతో ఢీకొని తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో రైల్వే గేట్ విరిగి ట్రాక్‌పై అడ్డంగా పడింది. బాధితుడిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మద్యం మత్తులో ఉండటంతో వివరాలు తెలియరా లేదు. బాధితుడి పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. రైల్వే అధికారులు సంఘటన స్థలాన్ని చేరుకొని రైల్వే గేట్‌కు మరమ్మతులు చేపట్టారు. ఈ సంఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

కార్యకర్తలు, అభిమానులే నా దమ్ము, ధైర్యం

- తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి



రాయలచెరువులో అభిమానుల మధ్య నడుస్తూ వెళుతున్న ప్రభాకర్‌రెడ్డి

యాడికి, జనవరి17: టీడీపీ కార్యకర్తలు, అభిమానులే నా దమ్ము, ధైర్యమని తాడిపత్రి మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. పెద్దవడుగూరు మండలంలో బుధవారం నిర్వహించనున్న బస్సుయాత్రకు యాడికి మండలం మీదుగా కార్యకర్తలు, అభిమానులతో కలిసి వెళ్లారు. మండలంలోని వేములపాడు జాతీయ రహదారి వద్ద చవ్వా గోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు ఆయనకు స్వాగతం పలికారు. రాయలచెరువు వద్ద జాతీయ రహదారిపై వేలూరు రంగయ్య, పరిమి చరణ్ ఆధ్వర్యంలో పెద్దఎత్తున బాణసంచా కాల్చి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు తన వెన్నంటి ఉన్నంత వరకు తనను ఎవరూ ఏమి చేయలేరని ఆయన తెలిపారు. టీడీపీ కార్యకర్తలు, అభిమానుల జోలికి ఎవరైనా వస్తే తాను అడ్డుగా నిలబడతానన్నారు. ఆయన వెంట నాయకులు మదమంచి శివ, రామచంద్రారెడ్డి, కులశేఖర్‌నాయుడు, నాగమునిరెడ్డి, చలమారెడ్డి, రజక శేఖర్, రవికుమార్‌రెడ్డి, రామునాయక్, బొట్టు శేఖర్, జయరాం నాయక్, నగరూరు నరసింహులు, త్రినాథ్‌రెడ్డి, హరినాథ్‌రెడ్డి, దివాకర్‌రెడ్డి, విజయ్, సత్యనారాయణరెడ్డి, భాస్కర్ ఉన్నారు.

సమాధులు కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ముందు బైఠాయించిన దళితులు

యాడికి, జనవరి17: మండలంలోని లక్షుంపల్లి గ్రామంలో దళితుల సమాధులను కూల్చిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద దళితులు బుధవారం బైఠాయించారు. వారు మాట్లాడుతూ లక్షుంపల్లి గ్రామంలో సర్వేనెంబర్ 127లో దళితుల శ్మశాన వాటిక కోసం 20సెంట్ల స్థలాన్ని అధికారులు కేటాయించారని తెలిపారు. కొందరు అగ్రవర్ణాల వారు శ్మశాన వాటికకు వెళ్లే రస్తాను ఆక్రమించి వారి వ్యవసాయ తోటలకు కంచెను ఏర్పాటు చేసుకున్నట్లు వెల్లడించారు. దీంతో ఎవరైనా మృతి చెందినపుడు శ్మశాన వాటికకు వెళ్లడానికి ఇబ్బంది పడుతున్నట్లు వివరించారు. సమీపంలో ఉన్న అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులు శ్మశాన వాటికలోని సమాధులను కూలదోసి స్థలాన్ని ఆక్రమించే ప్రయత్నాలు చేశారని ఆరోపించారు. వినతిపత్రాలు అందజేసిన స్పందన లేకపోవడంతో తహల్దార్ కార్యాలయం వద్ద బైఠాయించాల్సి వచ్చిందన్నారు. అనంతరం తహసీల్దార్ రాజ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఆందోళనలో పలువురు ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

పోలీసులను నిలదీసిన అంగన్‌వాడీలు



పోలీసులతో మాట్లాడుతున్న అంగన్‌వాడీలు

ఉరవకొండ, జనవరి 17: సామాజిక మాధ్యమాల్లో తమపై అసభ్యకరమైన పోస్టులు పెట్టినవారిపై కేసు నమోదు చేయడంలో ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని పోలీసులను అంగన్‌వాడీ కార్యకర్తలు బుధవారం నిలదీశారు. గత ఏడాది డిసెంబరు 20న ఉరవకొండ అభివృద్ధి కోసం అనే వాట్సాప్ గ్రూపులో అసభ్యకరంగా పోస్టులు చేశారన్నారు. దీనిపై గుంతకల్లు డీఎస్పీ నరసింగప్పకు ఫిర్యాదు చేసి 25రోజులు అయినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు రంగారెడ్డి, మధుసూదన్ పేర్కొన్నారు.

ఎన్టీఆర్ వర్ధంతికి రండి

పుట్లూరు, జనవరి17: స్థానిక టీడీపీ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్న నందమూరి తారకరామారావు వర్ధంతికి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆపార్టీ నాయకులు సుదర్శన్‌నాయుడు తెలిపా రు. ఈ సందర్భంగా ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు పంపిణీ చేస్తామని తెలిపారు.

బస్సు ఢీకొని ఒకరి మృత్యువాత

గుత్తి, జనవరి 17: పట్టణంలో అనంతపురం రోడ్డులోని హీరో షోరూం సమీపంలో బస్సు ఓ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో ఓబుళనాయుడు(40) మృతి చెందగా, రామచంద్ర తీవ్రంగా గాయపడ్డాడు. మండలంలోని బేతాపల్లి గ్రామానికి చెందిన ఓబుళనాయుడు, రామచంద్ర తురకపల్లి గ్రామంలో దేవరకు వెళ్లి వస్తుండగా ఈ సంఘటన జరిగింది. ఓబుళనాయుడు ప్రమాద స్థలంలోనే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన రామచంద్రను చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండటంతో అనంతపురం తరలించారు. ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

రైలు కింద పడి యువకుడి ఆత్మహత్య

గుత్తి, జనవరి 17: గుత్తి రైల్వే జీఆర్పీ పరిధిలోని తురకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి శివాజీ(30) ఆత్మహత్య చేసుకున్నట్లు జీఆర్పీ ఎస్‌ఐ నాగప్ప బుధవారం తెలిపారు. గుత్తి ఆర్‌ఎస్‌కు చెందిన శివాజీ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండేవాడు. ఎన్ని ఆస్పత్రులు తిరిగినా నయం కాకపోవడంతో మనస్తాపం చెంది తురకపల్లి రైల్వే బ్రిడ్జి సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకున్నట్లు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

గుత్తి రూరల్, జనవరి 17: మండలంలోని కొత్తపేట గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై మంగళవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు గాయపడ్డాడు. గుత్తికి చెందిన హేమంత్ ద్విచక్ర వాహనంలో కొత్తపేట వైపు నుంచి గుత్తికి వెళ్తుండగా గ్రామశివారులో డివైడర్‌ను ఢీకొని కిందపడ్డాడు. తీవ్రంగా గాయపడిన హేమంత్‌ను స్థాని కులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

ఘనంగా శ్రీ కృష్ణదేవరాయలు జయంతి



నివాళులు అర్పిస్తున్న బలిజ సంఘం నాయకులు

తాడిపత్రి టౌన్, జనవరి 17: పట్టణంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతి వేడుకలు బుధవారం ఘనంగా జరిగాయి. పట్టణంలోని శ్రీనివాసపురం లో గల శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి బలిజసంఘం నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.

పశు బీమాకు దరఖాస్తు చేసుకోండి

బ్రహ్మసముద్రం, జనవరి 17: వైఎస్సార్ పశు బీమా పథకానికి ప్రభుత్వం బడ్జెట్ కేటాయించిందని, పాడి రైతులు, గొర్రెల కాపర్లు వారి పశు సంపదకు బీమా చేయించుకోవాలని పశువైద్యాధికారి కోరారు. పశువుల యజమానులు త్వరగా ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

శ్రీపురంగా మారిన కొజ్జేపల్లి

గుత్తి రూరల్ జనవరి17: మండలంలోని కొజ్జేపల్లి శ్రీపురంగా మారింది. ఈ మేరకు పంచాయతీ రాజ్ శాఖ బుధవారం ఉత్వర్వులు జారీ చేసింది. 20 ఏళ్లుగా గ్రామస్థులు తహసీల్దార్, ఎంపీడీఓలకు ఎన్నో సార్లు పేరు మార్చాలని వినతులు అందజేశారు. బుధవారం గ్రామస్థుల కల నెరవేరింది.

వైసీపీ నుంచి టీడీపీలోకి చేరిక



ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలో చేరుతున్న వైసీపీ నాయకులు

కూడేరు, జనవరి 17: వైసీపీ ప్రజా వ్యతిరేక విధానాలు నచ్చక ఆ పార్టీ నుంచి పలువురు టీడీపీలోకి చేరుతున్నట్లు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. మండలంలోని పి. నారాయణపురం గ్రామానికి చెందిన 10 కుటుంబాల వారు బుధవారం వైసీపీని వీడారు. గ్రామానికి చెందిన వెంకటేష్ రెడ్డి, సాయినాథ్‌రెడ్డి, కుమ్మేత హనుమంతరెడ్డి, ఉప్పిలి ఆదినారాయణరెడ్డి, కురుబ వెంకటేశులు, తదితరులు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వచ్చే ఎన్నికల్లో టీడీపీ ఘన విజయం సాధిస్తున్నారు. నారాయణస్వామి, రమేష్‌రెడ్డి, ముత్యాలరెడ్డి, కేశవరెడ్డి, ఎర్రిస్వామిరెడ్డి, హనుమంతరెడ్డి, ఆదినారాయణ, రాజప్ప, లింగరాజు, శీన పాల్గొన్నారు.

ముగిసిన మారెమ్మ జాతర



మారెమ్మ దేవిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్

బెళుగుప్ప, జనవరి 17: మండలంలోని నరసాపురంలో గ్రామదేవత మారెమ్మ జాతర బుధవారం ఘనంగా ముగిసింది. రెండు రోజుల పాటు భక్తి శ్రద్ధలతో గ్రామస్థులు జాతరను ఘనంగా జరుపుకున్నారు. అమ్మవారికి ఉదయాన్నే పుష్పాలంకరణ చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్ మారెమ్మదేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు ఎమ్మెల్యే పయ్యావుల కేశవ్‌కు భారీ గజమాలతో స్వాగతం పలికారు.

దోనిముక్కల గ్రామంలో దేవర



గ్రామ దేవరకు హాజరైన జితేంద్రగౌడు

గుంతకల్లు, జనవరి17: మండలంలోని దోనిముక్కల గ్రామంలో పెద్దమ్మ, సుంకులమ్మ దేవరలను బుధవారం ఘనంగా నిర్వహించారు. మాజీ శాసనసభ్యుడు జితేంద్రగౌడు గ్రామంలోని సర్పంచు శ్రీరాములు, టీడీపీ నాయకుడు రాము తదితరుల ఇళ్లకు వెళ్లి దేవర కార్యక్రమాలలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో సొసైటీ మాజీ అధ్యక్షుడు పాల మల్లికార్జున, టీ కేశప్ప, నాయకులు హనుమంతు, రాయల్ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

తురకపల్లిలో వైభవంగా ఊరిదేవర



గుత్తి రూరల్, జనవరి 17: మండలంలోని తురకపల్లిలో బుధవారం తెల్లవారుజామున పెద్దమ్మ దేవత ఊరిదేవర వైభవంగా జరిగింది. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో అమ్మవారికి అభిషేకాలు చేసి, కుంభం పోసి, ఊరి చుట్టూ పొలి చల్లి జంతువులను బలి ఇచ్చారు. గ్రామస్థులు పెద్ద అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఐదేళ్ల తర్వాత గ్రామంలో ఊరి దేవర జరగడంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి నుంచి సైతం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. అమ్మవారిని టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకటశివుడు యాదవ్, టీడీపీ సీనియర్ నాయకుడు హరినాథ్‌గౌడ్ దర్శించుకున్నారు.



రాయదుర్గంలో ఐసీడీఎస్ కార్యాలయం ముందు బైఠాయించి నిరసన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



ఉరవకొండలో ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



గుంతకల్లులో షోకాజ్ నోటీసులతో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీ వర్కర్లు



గుత్తి ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు



కళ్యాణదుర్గంలో సీడీపీవోకు సంజాయిషీ లేఖలు ఇస్తున్న అంగన్‌వాడీలు



తాడిపత్రిలో సీడీపీఓకు పత్రాలు ఇస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

ఇదిగో మా సమాధానం !

డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీలకు ప్రభుత్వం పంపిన షోకాజ్ నోటీసులకు వారు బుధవారం సమాధానం ఇచ్చారు. ఆయా ప్రాంతాల్లో ఉన్న ఐసీడీఎస్ కార్యాలయాల వద్దకు చేరుకుని అధికారులకు సమాధాన పత్రాలు అందజేశారు. అనంతరం ఎప్పటిలాగే సమ్మె శిబిరం వద్ద నిరసన తెలిపారు. తమ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. వీరికి వామపక్ష నాయకులు, సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



రాయదుర్గం పట్టణంలో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ వర్కర్లు

చంద్రబాబుతోనే సంక్షేమ పథకాలు



మహిళతో మాట్లాడుతున్న బండారు శ్రావణి

పుట్లూరు, జనవరి 17: టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడుతోనే సంక్షేమ పథకాలు అమలవుతాయని నియోజకవర్గ నాయకురాలు బండారు శ్రావణి తెలిపారు. మండలంలోని మడ్డిపల్లి గ్రామంలో బుధవారం బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి పార్టీ మినీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో జీసీ బాబు, గోవర్ధన్‌రాజు, వేణు, జయరామిరెడ్డి, రవీంద్ర, ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ

కణేకల్లు, జనవరి 17: మండల వ్యాప్తంగా మూడు ఎరువుల దుకాణాలలో అధికారులు తనిఖీ చేసి సరైన పత్రాలు లేని రూ. 3.10 లక్షల విలువ గల ఎరువుల విక్రయాలను నిలిపివేసినట్లు కళ్యాణదుర్గం ఏడీఏ ఎల్లయ్య తెలిపారు. మండల వ్యాప్తంగా బుధవారం ఎరువుల దుకాణాలలో ఏడీఏ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. కణేకల్లు క్రాసింగ్‌లోని కోరమండల్ ఎరువుల దుకాణం, కణేకల్లులోని ఏబీఎఫ్‌ఎస్‌సీఎస్ ఎరువుల దుకాణం మరో ఎరువుల దుకాణంలో తనిఖీలు నిర్వహించి అర్హత పత్రాలు సక్రమంగా లేనందున ఎరువుల విక్రయాలు నిలిపివేసినట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమానికి ఏఓ శ్రావణ్‌కుమార్, వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

డ్రైనేజీ మరమ్మతు చేయండి

బెళుగుప్ప, జనవరి 17: డ్రైనేజీ మరమ్మతులకు చర్యలు తీసుకోవాలంటూ బెళుగుప్ప ఎస్సీ కాలనీవాసులు బుధవారం గ్రామ కార్యదర్శి వెంకటేశులుకు విన్నవించారు. కాలనీవాసులు మాట్లాడుతూ కొన్ని నెలలుగా డ్రైనేజీ మరమ్మతులకు నోచుకోక పోవడంతో మురుగునీరు రోడ్లపైకి వస్తోందన్నారు. దీంతో కంపు భరించలేకపోతున్నట్లు వాపోయారు. సమస్య పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు.

ఎలుగుబంటి సంచారంపై అవగాహన



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న అటవీశాఖ అధికారులు

యాడికి, జనవరి 17: మండలంలోని చందన గ్రామ సమీపంలో వారంరోజుల నుంచి ఎలుగుబంటి సంచరిస్తుండటంతో గ్రామస్థులకు అవగాహన కల్పించేందుకు అటవీ అధికారులు పూనుకున్నారు. బుధవారం చందన గ్రామానికి వచ్చిన ఫారెస్ట్ అధికారులు ఎలుగుబంటి సంచార ప్రాంతాలను పరిశీలించారు. పెద్దగొంది మైనింగ్ ప్రాంతం, గుందారగుట్ట ప్రాంతాల్లో ఎలుగుబంటి సంచరిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అధికారులు ఆయా ప్రదేశాలను పరిశీలించారు. వన్యప్రాణులను చంపడం చట్టరీత్యానేరమని, అటవీ మృగాలు మీ ప్రాంతాల్లో సంచరిస్తుంటే అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. అడవి మృగాల నుంచి ప్రమాదం సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు వివరించారు. అవగాహన కార్యక్రమంలో ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నారపరెడ్డి, ఏబీఓలు చంద్రశేఖర్, మంజులవాణి, ఎఫ్‌బీఓ మాధవి, సర్పంచు నారాయణమ్మ, రామాంజనేయులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కుందుర్పి, జనవరి 17: స్థానిక రుషి డిగ్రీ కళాశాలలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎంపీడీవో లక్ష్మీనరసింహ, ఎంఈవో తిప్పేస్వామి, డిప్యూటీ తహసీల్దార్ కుళ్లాయప్ప, పంచాయతీ సెక్రెటరీ బాషా తదితరులు పాల్గొని మాట్లాడారు. మారుమూల ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కంటి వైద్య శిబిరంలో 65 మందికి స్క్రీనింగ్ నిర్వహించారు. అందులో 30 మంది ఆపరేషన్లకు ఎంపిక కాగా అందులో 25 మందిని ఆపరేషన్ల నిమిత్తం ఆస్పత్రికి పంపినట్లు తెలిపారు. కార్యక్రమంలో సక్షమ్ ప్రతినిధులు అనుమేష్, ఆనంద్, ఎస్‌వీజీ బోర్‌వెల్స్ అధినేత లక్ష్మణమూర్తి, గురుప్రసాద్, నరేంద్రనాయుడు, వెంకటేష్, మర్రిస్వామి, లక్ష్మీ, హరిప్రసాద్, నాగేంద్ర, శీన, దేవరాజు, వీరన్న పాల్గొన్నారు.

దుకాణదారుడికి జరిమానా

కణేకల్లు, జనవరి 17: మండల కేంద్రంలోని ఓ దుకాణ దారుడికి రూ. 15 వేలు జరిమానా విధించినట్లు తూనికలు, కొలతల శాఖ అధికారి శంకర్ తెలిపారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ఓ జనరల్ స్టోర్‌లో దుకాణదారుడు తాను విక్రయిస్తున్న సిగరెట్ ప్యాక్‌కు సంబంధించిన గరిష్ఠధర, కన్జూమర్ కేర్ లేకుండా విక్రయిస్తున్నాడని ఫోన్ ద్వారా సమాచారం రావడంతో ఆ దుకాణంపై దాడి చేసి జరిమానా విధించామన్నారు. సిగరెట్ ప్యాకెట్లను సీజ్ చేసినట్లు ఆయన పేర్కొన్నారు.

సారా స్థావరంపై పోలీసుల దాడి

యాడికి, జనవరి17: మండలంలోని లక్షుంపల్లి గ్రామశివారులో నాటుసారా తయారీ స్థావరంపై పోలీసులు బుధవారం దాడి చేసి ఒకరిని అరెస్ట్ చేశారు. యాడికి సీఐ నాగార్జునరెడ్డి తెలిపిన మేరకు మండలంలోని లక్షుంపల్లి గ్రామశివారులో నాటుసారా తయారు చేస్తున్నట్లు వచ్చిన సమాచారంతో సిబ్బందితో కలిసి దాడి చేశామన్నారు. దాడిలో 1000లీటర్ల సారా ఊటను ధ్వంసం చేశామన్నారు. 20లీటర్ల సారాను సీజ్ చేశామన్నారు. సారా తయారుచేస్తున్న కరిడికొండ సాంబశివుడు అనే వ్యక్తిని అరెస్ట్‌చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు. దాడిలో ఏఎస్‌ఐలు వెంకటేష్, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.